
అసైన్డ్ భూముల్లో భూచోళ్లు!

పెద్దల గుప్పిట్లో పేదల జాగాలు

అడ్డగోలుగా ఆన్‌లైన్ చేసిన తహసీల్దార్లు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీ కుంభకోణం



ఈనాడు, ఏలూరు, చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే


పేదలు నాలుగు తిండి గింజలు పండించుకునేందుకు ప్రభుత్వం ఇచ్చిన భూములను సైతం వైకాపా నేతలు మింగేశారు. నిబంధనలకు నీళ్లొదిలి అసైన్డ్ భూముల రికార్డులు తారుమారు చేయించారు. ముడుపుల మత్తులో, నేతల అండతో కొందరు రెవెన్యూ అధికారులు అడ్డగోలుగా వ్యవహరించారు. దీంతో ఉమ్మడి జిల్లాలో వేలాది ఎకరాలు పెద్దల గుప్పిట్లో ఉన్నాయి.

అసైన్డు భూములను సాగు చేసుకోవటం తప్ప క్రయవిక్రయాలు నిషిద్ధం. లబ్ధిదారు పేరు ప్రభుత్వ దస్త్రాల్లో మార్చుకునేందుకు వీలు లేకుండా ఈ భూములను నిషేధిత జాబితాలో పెట్టారు. పట్టాలిచ్చిన వారు మరణించినా వారసులకు సంక్రమిస్తుంది తప్ప ఇతరులకు దానిపై హక్కు ఉండదు. ఈ తరహా భూములు ఉమ్మడి జిల్లాలో దాదాపు 2 లక్షల ఎకరాల వరకు ఉన్నాయి. వైకాపా పాలనలో కొందరు భూస్వాములు పేదల అవసరాల ముసుగులో అరకొర ధరలు చెల్లించి స్వాధీనం చేసుకున్నారు.

☛ చింతలపూడి మండలం ఎర్రగుంటపల్లిలో వెయ్యి ఎకరాల అసైన్డు భూమి ఉంది. వీటిలో 100 సర్వే నంబర్లకు సంబంధించిన 300 ఎకరాల్లో రికార్డులు మార్చేశారు. లబ్ధిదారుల పేరు మీద పట్టా ఉన్నా ఆన్‌లైన్ మాత్రం వారి పేరుపై లేకుండా అధికారులు ముడుపులు తీసుకుని కథ నడిపించారు. తాజాగా దీనిపై గ్రామానికి చెందిన తుల్లిమిల్లి కుటుంబరావు సమాచార హక్కు చట్టం ద్వారా ప్రశ్నించగా వెలుగులోకి వచ్చింది.

☛ నరసాపురం మండలంలో ఓ వైకాపా నేత చక్రం తిప్పారు. దాదాపు 150 ఎకరాల అసైన్డ్, డీపట్టా, జిరాయితీ భూములను తన అనుచరులతో తక్కువ మొత్తానికి కొనుగోలు చేయించారు. రెవెన్యూ అధికారులతో ఆన్‌లైన్ చేయించుకున్నారు. మొగల్తూరు మండలం మోళ్లపర్రులో కూడా ఆ నేత అనుచరుడితో దాదాపు 50 ఎకరాల అసైన్డు భూమి కొనుగోలు చేయించి ఏకంగా రిజిస్ట్రేషన్ కూడా చేయించడం అప్పట్లో పెద్ద దుమారం రేగింది.

> జిల్లాలో దాదాపు 70 శాతం భూములు రెండు మూడు చేతులు మారిపోయాయి. పట్టా పొంది 20 ఏళ్ల అనుభవంలో ఉన్న వారికి వైకాపా సర్కారులో క్రయ విక్రయాలకు హక్కులు(ఫ్రీహోల్డ్) ఇచ్చారు. దీని ముసుగులో అర్హత లేని వారికి కూడా రెవెన్యూ అధికారులు హక్కులు కల్పించారు.



చింతలపూడిలో 80 శాతం.. ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా చింతలపూడి మండలంలోనే 18 వేల ఎకరాల అసైన్డ్ భూములున్నాయి. వీటిలో దాదాపు 80 శాతం క్రయ విక్రయాలు జరిగిపోయాయి. అసైన్డ్ భూముల అమ్మకాలు, కొనుగోళ్లు నిషిద్ధం కాగా 2019-24 మధ్య కాలంలో చింతలపూడిలో పని చేసిన ముగ్గురు తహసీల్దార్లు ఏకంగా రికార్డులే మార్చేశారు. ప్రభుత్వం పట్టాలు ఇచ్చిన లబ్ధిదారుల పేర్లను తొలగించి కొనుగోలు చేసిన వారి పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. వారికి పాసు పుస్తకాలు కూడా రప్పించారు. ఎకరానికి రూ.లక్ష నుంచి రూ.1.8 లక్షల వరకు వసూలు చేశారు. ఒక్క చింతలపూడి మండలంలోనే దాదాపు 8వేల ఎకరాల వరకు ఇలా రికార్డులు మార్చారు. ఎకరానికి సగటున రూ.లక్ష లెక్కన రూ.80 కోట్లు స్వాహా చేశారు. ఈ అంశమై ఏలూరు, పశ్చిమ డీఆర్వోలు పుష్పమణి, ఉదయభాస్కరరావు మాట్లాడుతూ.. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నేటి నుంచి బడులకు సెలవులు

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలకు ఈ నెల 3 నుంచి 13 వరకు దసరా సెలవులు ప్రకటించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం తెలిపారు. ఈ నెల 14న పాఠశాలలు పునః ప్రారంభం అవుతాయన్నారు. సెలవు రోజుల్లో పాఠశాలలు తెరచి తరగతులు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఒక ప్రకటనలో హెచ్చరించారు.

బకాయిలకు మోక్షం

ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథక లబ్ధిదారులకు ఊరట

ఉంగుటూరు, న్యూస్‌టుడే: తినీ తినక సంపాదనలో కొంత కూటబెట్టుకుని సొంతిల్లు నిర్మించుకోవాలనేది సగటు మనిషి ఆశ. ఇలాంటి వారి ఆశలను సాకారమే లక్ష్యంగా తెదేపా ప్రభుత్వం(2014-19)లో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకంలో భాగంగా సొంత స్థల ఉన్న వారికి ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.1.50 లక్షలు చొప్పున మంజూరు చేసింది. తెదేపా హయాంలో ఇళ్ల నిర్మించుకున్న వారికి కొంత మేర బిల్లులు చెల్లించింది. 2019లో వైకాపా అధికారంలోకి వచ్చాక 2020లో బకాయిలు చెల్లిస్తామని ప్రకటించి చివరికి లబ్ధిదారులకు మొండి చేయి చూపించింది.


నారాయణపురంలో అసంపూర్తిగా ఇంటి నిర్మాణం

ఆలస్యమైనా సొమ్ములు చెల్లిస్తారనే ఆశతో అప్పులు చేసి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. అయిదేళ్లుగా సొమ్ముల కోసం ఎదురు చూస్తున్న లబ్ధిదారుల్లో ఎన్డీయే ప్రభుత్వం బకాయిలు చెల్లింపునకు నిర్ణయం తీసుకుంది. దీంతో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

క్షేత్ర స్థాయిలో సర్వే.. ఏలూరు జిల్లాలో సొంత స్థలం ఉన్న వారికి ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకంలో భాగంగా వేల సంఖ్యలో ఇళ్లు మంజూరు చేశారు. వైకాపా అధికారంలోకి వచ్చిన నాటికి 25,973 ఇళ్లకు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ ఇళ్ల ప్రస్తుత పరిస్థితిపై గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో సర్వే చేస్తున్నారు. గ్రామ సచివాలయాల ఇంజినీరింగ్ సహాయకులు, గృహనిర్మాణ సంస్థ అధికారులు, సిబ్బంది క్షేత్ర స్థాయికి వెళ్లి పరిశీలించి తాజా పరిస్థితిని యాప్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. దీనిపై గృహనిర్మాణ సంస్థ పీడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ మరో రెండు వారాల్లో సర్వే పూర్తవుతుందన్నారు. బడ్జెట్ విడుదల కాగానే లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు.

బకాయిలు చెల్లించాల్సిన ఇళ్లు	ఇప్పటి వరకు సర్వే పూర్తైనవి	సర్వే చేసిన వాటికి చెల్లించాల్సిన బకాయిలు	సర్వే చేయాల్సిన ఇళ్లు
25,973	15,124	రూ.8.69 కోట్లు	10,849

గాంధీ మాట.. స్ఫూర్తి బాట


బాపూజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న వెట్రిసెల్వి, చిత్రంలో జేసీ తదితరులు

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా కలెక్టరేట్ ఆవరణలోని మహాత్ముని విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆమె మాట్లాడుతూ... సత్యం, అహింసను ఆయుధాలుగా చేసుకుని, దేశానికి స్వాతంత్య్రం తీసుకొచ్చేందుకు గాంధీజీ చేసిన పోరాటాలు ఎనలేనివన్నారు. జడ్పీ ఛైర్‌పర్సన్ పద్మశ్రీ మాట్లాడుతూ.. గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి తదితర మహనీయుల జీవితాలను యువత స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని కోరారు. జేసీ పి.ధాత్రిరెడ్డి, డీఆర్వో పుష్పమణి, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు వి.శ్రీలక్ష్మి, కలెక్టరేట్ ఏవో నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

దసరా రద్దీ!



దసరా సెలవుల నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులతో రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండులు కిటకిటలాడుతున్నాయి. రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక రైళ్లను, బస్సులను నడుపుతున్నా ప్రయాణికుల అవస్థలు తప్పడంలేదు. ఏలూరు రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్లలో కనిపించిన చిత్రాలివి. - ఈనాడు, ఏలూరు

రేపు కైకలూరులో ఉద్యోగ మేళా

ఏలూరు అర్బన్, కైకలూరు, న్యూస్‌టుడే: కైకలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎ.వి.కృష్ణారెడ్డి తెలిపారు. వివిధ ప్రైవేటు సంస్థల్లో 362 ఖాళీలను ఉద్యోగ మేళా ద్వారా భర్తీ చేయనున్నట్లు చెప్పారు. పది, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, డిగ్రీ, బీటెక్, పీజీ విద్యార్హత కలిగి... 18 నుంచి 35 ఏళ్లలోపు వయసున్న వారు అర్హులని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేటి నుంచి 'టెట్'

ఈ నెల 21 వరకు నిర్వహణ

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో 'ఉపాధ్యాయ అర్హత పరీక్ష'(టెట్) గురువారం నుంచి ప్రారంభం కానుంది. ఈ నెల 21 వరకు కొనసాగనుంది. జిల్లాలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఏలూరు సమీప వట్లూరులోని సిద్ధార్థ క్వెస్ట్ సీబీఎస్ఈ పాఠశాల, సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్షలు జరగనున్నాయి. మొత్తం 5,670 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. సిద్ధార్థ క్వెస్ట్ సీబీఎస్ఈ పాఠశాలలో గురువారం నుంచి 21 వరకు పరీక్షలు నిర్వహిస్తుండగా- సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో మాత్రం ఈ నెల 6న మాత్రమే పరీక్ష జరగనుంది. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకునే మార్గాలను నిర్దేశిస్తూ... ఏలూరు కొత్త బస్టాండ్, సత్రంపాడు, వట్లూరు వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

సమయపాలన పాటించాల్సిందే.. అభ్యర్థులు నిర్ణీత వేళకు పరీక్ష కేంద్రానికి హాజరు కావాల్సిందే. నిమిషం ఆలస్యమైనా లోపలికి అనుమతించరు. ఆయా తేదీల్లో ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. కనీసం గంట ముందుగా అభ్యర్థులు కేంద్రానికి చేరుకోవాలని డీఈవో ఎస్.అబ్రహం సూచించారు. హాల్‌టికెట్‌తోపాటు ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డును వెంట తెచ్చుకోవాలని తెలిపారు. చరవాణులు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించరని స్పష్టం చేశారు.

తొలి రోజు రెండే

మద్యం దుకాణ దరఖాస్తులకు అమావాస్య ప్రభావం

ఏలూరు నేరవార్తలు న్యూస్‌టుడే: మద్యం దుకాణాల టెండర్ల ప్రక్రియ దరఖాస్తులు తొలి రోజు మందకొడిగా సాగింది. కైకలూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో బుధవారం రెండే దరఖాస్తులు అందాయి. అమావాస్య కారణంతో ఆశావహులు దరఖాస్తు చేసేందుకు ముందుకు రాలేదు. గురువారం నుంచి ప్రక్రియ ఊపందుకోవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఏలూరు జిల్లాలోని ఏడు ప్రొబిషన్, ఎక్సైజ్ పోలీసుస్టేషన్లలో నేరుగా దరఖాస్తులు చేసుకోవచ్చని వారు పేర్కొన్నారు. ఏలూరులో ఏఎస్ఆర్ మైదానం సమీప ఎక్సైజ్ పోలీసుస్టేషన్, చింతలపూడిలో మారుతీనగర్, భీమడోలులో హెచ్‌పీ పెట్రోలు బంకు సమీపం, జంగారెడ్డిగూడెంలో అశ్వారావుపేటరోడ్డు, పోలవరంలో ఎలిఫెంట్ రోడ్డు, నూజివీడులో గాంధీనగర్, కైకలూరు మెయిన్ రోడ్డులోని ఎంపీడీవో కార్యాలయ సమీప ఎక్సైజ్ పోలీసుస్టేషన్లలో దరఖాస్తులు అందించాలని అధికారులు కోరారు.

నేడు పోలవరం అథారిటీ సీఈవో రాక

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం ప్రాజెక్టు అథారిటీ సీఈవో అతుల్‌జైన్ రాకను పురస్కరించుకుని ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతాలను ఇన్‌ఛార్జి సీఈ, ప్రాజెక్టు ఎస్ఈ కె.నరసింహమూర్తి బుధవారం పరిశీలించారు. రెండ్రోజుల పర్యటనలో భాగంగా సీఈవో గురువారం ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతాలను పరిశీలిస్తారని, శుక్రవారం ముఖ్యమైన పనులపై క్యాంపు కార్యాలయంలో జలవనరుల శాఖాధికారులు, వివిధ సంస్థల ప్రతినిధులతో సమీక్షిస్తారని పేర్కొన్నారు.

పట్టభద్రులకు ఓట్ల పండగ | 8లో | రత్నాచల్ 30 ఏళ్ల సంబరాలు

ఫాగింగ్ తక్కువ.. ఖర్చెక్కువ!

• పట్టణాల్లో దోమల విజృంభణ
• జ్వరాలతో జనం ఇబ్బందులు

జంగారెడ్డిగూడెం, చింతలపూడి, ఏలూరు టూటౌన్, నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణాల్లో ఫాగింగ్ మాయ జరుగుతోంది. వ్యయం మాత్రం గట్టిగానే ఉంటోంది. కానీ ఆ స్థాయి ఫలితాలు ఉండటం లేదు. ఒకవైపు అపరిశుభ్రత, దోమల బెడదతో పురాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం ఆరు దాటితే చాలు ఆరు బయట నిమిషం పాటు నిలబడలేని.. కూర్చోలేని.. పరిస్థితులు నెలకొంటున్నాయి. సామాన్య, మధ్య తరగతి ప్రజలకు రాత్రి వేళ కంటిమీద కునుకు ఉండటం లేదు.


జంగారెడ్డిగూడెం పురపాలక సంఘంలో పనిచేయని యంత్రం

రూ.లక్షల్లో ఖర్చు

ఏలూరు నగరంతో పాటు చింతలపూడి, జంగారెడ్డిగూడెం పట్టణాల్లో ఫాగింగ్ యంత్రాలు మరమ్మతులకు గురై మూలకు చేరాయి. ఒకటీ అరా ఉన్నా తూతూ మంత్రంగా ఉపయోగిస్తున్నారు. కొన్నిసార్లు ఫాగింగ్ చేయకున్నా దస్త్రాల్లో మాత్రం డీజిల్, పెట్రోలు, మలాథీయాన్ ఖర్చు రూ.లక్షల్లో చూపుతున్నారు. ప్రస్తుతం కాలనుగుణ వ్యాధులు, విష జ్వరాలు ప్రబలి రోగులతో ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. డెంగీ కేసులు పెరిగాయి. మురుగు కాలువలు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. లార్వా నిర్మూలన చర్యలు కనిపించడం లేదు.

చింతలపూడి 20 | 30,000

ఈ నగర పంచాయతీలో ఫాగింగ్ సక్రమంగా లేదు. యంత్రాలు రెండు తరచూ పాడవుతున్నాయి. ఈ సీజనల్‌లో రెండుసార్లు మరమ్మతులకు గురయ్యాయి. ప్రతి సారి రూ.10 వేలు ఖర్చు పెడుతున్నారు. ఇటీవల డెంగీ కేసులు కూడా నమోదయ్యాయి.

నూజివీడు 32 | 60,000

ఈ పట్టణంలో రెండు యంత్రాలు వినియోగిస్తున్నారు. ఒక్కోదానికి రోజుకు 10 లీటర్ల డీజిల్, మూడు లీటర్ల పెట్రోల్ వినియోగిస్తున్నారు. కానీ ఫాగింగ్ మాత్రం సరిగా ఉండటం లేదు. దోమల బెడద తొలగలేదని ప్రజలు వాపోతున్నారు.


జంగారెడ్డిగూడెం: రెండేళ్ల నాడే మూలకు చేరిన ఫాగింగ్‌కు ఉపయోగించే వ్యాన్

పరిశీలన

జంగారెడ్డిగూడెం 29 వార్డులు | 70,000 జనాభా

ఇక్కడ రెండు యంత్రాలు పాడయ్యాయి. గతంలో ఉన్న వాటి నుంచి మంట వస్తోందని వాటి స్థానంలో కొత్తవి కొన్నారు. అవి కూడా పనిచేయడం లేదు. దీనికి తోడు ఫాగింగ్ చేయడానికి ఉపయోగించే వ్యాన్ సుమారు రెండేళ్ల కిందట మరమ్మతులకు గురైంది.


ఏలూరు కట్టా సుబ్బారావు తోటలో మురుగు

ఏలూరు 50 | 3.70 లక్షలు

ఎక్కువ సామర్థ్యం కలిగిన ఫాగింగ్ యంత్రం మూలకు చేరింది. మరమ్మతులు చేయకుండా వదిలేశారు. 8 హ్యాండ్ పరికరాలకు రెండు పాడయ్యాయి. ఆరు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. నగరంలోని 50 డివిజన్లకు క్రమం తప్పకుండా రెండేసి పర్యాయాలు ఫాగింగ్ చేయాల్సి ఉన్నా.. ఎక్కడా ఆ దాఖలాలు కనిపించడం లేదు.

డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే రాష్ట్రాభివృద్ధి


ద్వారకాతిరుమలలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ పురందేశ్వరి

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: వరద బాధితులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి తోడు కేంద్ర ప్రభుత్వం సైతం రూ.1400 కోట్లు కేటాయించిందని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. ద్వారకాతిరుమలలో ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, మాజీ మంత్రి జవహర్‌తో కలిసి బుధవారం భూమి పూజ చేశారు. ముందుగా వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమన్నారు. ద్వారకాతిరుమలకు ఉపాధి నిధులు రూ.1.50 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. అనంతర డ్వాక్రా మహిళలకు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు లంకా సత్యనారాయణ, దొడ్డిగర్ల సువర్ణరాజు, పాకలపాటి గాంధీ, మొగతడకల శ్రీనివాసరావు, హోంప్రకాష్, నాదెళ్ల సురేంద్రనాథ్ చౌదరి, ఏపూరి దాలయ్య, బద్రి తదితరులు పాల్గొన్నారు.

అధిక వడ్డీలు వసూలు చేసేవారిపై ఉక్కుపాదం మోపుతాం

ఏలూరు కాల్‌మనీ ఘటనపై హోం మంత్రి అనిత ఆగ్రహం

ఈనాడు డిజిటల్, అమరావతి: అధిక వడ్డీల వసూలుతో అమాయకులను వేధించే వారిపై ఉక్కుపాదం మోపుతామని హోం మంత్రి వంగలపూడి అనిత హెచ్చరించారు. ఏలూరు కాల్‌మనీ ఘటనను ఉద్దేశించి బుధవారం ఓ ప్రకటనలో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. 'రోజూవారీ వడ్డీల పేరుతో సామాన్యులను జలగల్లా పీల్చేవారి పట్ల కఠినంగా వ్యవహరిస్తాం. వసూళ్ల పేరుతో మహిళలను బెదిరించి, వేధిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. కిస్తీలకు ముందే వడ్డీ పేరుతో కోత, సమయం దాటితే రెట్టింపు మొత్తం వసూలు చేస్తే చర్యలు తీసుకుంటాం. ఇలాంటి ఘటనలు జరగకుండా నిఘా వ్యవస్థ ఏర్పాటు చేస్తాం. ఏలూరు ఘటనపై ఆ జిల్లా ఎస్పీతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నా' అని పేర్కొన్నారు.

నిత్యసాధనతో విజయాలు


పోటీలకు హాజరైన క్రీడాకారులు

పెదవేగి, న్యూస్‌టుడే: క్రీడలతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని డీవీఈవో ప్రభాకరరావు అన్నారు. స్థానిక గురుకుల బాలుర పాఠశాల క్రీడా మైదానంలో పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యాన అండర్-19 విభాగం రాష్ట్రస్థాయి పోటీలను బుధవారం ప్రారంభించి మాట్లాడారు. ప్రతి క్రీడాకారుడు విజయం సాధించాలన్న లక్ష్యంతోనే మైదానంలోకి దిగుతాడని.. కానీ, ఒకరే విజేతగా నిలుస్తారన్నారు. ఓటమి పాలైన వారు నిరుత్సాహానికి గురికాకుండా నిత్య సాధనతోనే విజయాలు సొంతం చేసుకోగలరన్నారు. ఎస్జీఎఫ్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కె.జయరాజు మాట్లాడుతూ... సాఫ్ట్‌బాల్, రగ్బీ పోటీల్లో పాల్గొనేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 420 మంది క్రీడాకారులు తరలివచ్చారని, వారంతా గెలుపోటములను సమానంగా స్వీకరించాలని ఆయన కోరారు. పాఠశాల ప్రధానాచార్యుడు ఎం.వెంకటేశ్వరరావు, పోటీల పరిశీలకులు కె.వెంకటేశ్వరరావు, పి.సుబ్బారావు, పీడీలు, పీఈటీ, క్రీడాకారులు పాల్గొన్నారు.

నచ్చిన మిల్లులో అమ్ముకొనే అవకాశం

☛ ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు సన్నాహాలు ☛ ఈనెల 7 నుంచి ప్రారంభం

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని విక్రయించుకోవడానికి గత వైకాపా ప్రభుత్వ పాలనలో పడిన ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. పంట పండించిన తర్వాత దాన్ని మిల్లుల్లో విక్రయించుకోవడానికి, అనంతరం సొమ్మును పొందడానికి ఎన్నో అవస్థలు పడ్డారు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతోంది.

'ర్యాండమైజేషన్' విధానానికి స్వస్తి.. గత ప్రభుత్వం ధాన్యం సేకరణకు 'ర్యాండమైజేషన్' విధానాన్ని అవలంబించింది. రైతులకు నిర్దేశించిన రైస్ మిల్లుల్లో మాత్రమే ధాన్యం విక్రయించుకునే విధానం అమల్లో ఉండేది. ప్రస్తుత ప్రభుత్వం దీనికి స్వస్తి పలికింది. నచ్చిన మిల్లులో విక్రయించుకునే అవకాశం కల్పించింది. దీంతోపాటు ధాన్యం విక్రయించిన ఇకపై 48 గంటల తర్వాత సొమ్మును జమ చేసే విధానాన్ని అమలు చేయనుంది.


ధాన్యం పట్టుబడిలో రైతులు

250 కేంద్రాల ఏర్పాటు.. జిల్లాలో రైతుల నుంచి ఖరీఫ్ ధాన్యాన్ని సేకరించేందుకు 250 రైతు సేవా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ముందుగా ఈనెల 7న ఉంగుటూరు, భీమడోలులో ప్రారంభిస్తారు.

సంచుల కొరత నివారణకు చర్యలు.. ధాన్యం సేకరణకు దాదాపు 85 లక్షల గోనె సంచులు అవసరం కాగా ముందస్తుగానే సిద్ధం చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. మిల్లర్ల వద్ద దాదాపు 45 లక్షలు అందుబాటులో ఉన్నాయి. మరో 5 లక్షలు పౌరసరఫరాల సంస్థ సిద్ధం చేసింది. ముందుగా ప్రారంభించే ధాన్యం సేకరణ కేంద్రాల్లో 10 వేల చొప్పున అందుబాటులో ఉంచనున్నట్లు పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు శ్రీలక్ష్మి తెలిపారు.

95 శాతం ఈ-క్రాప్ నమోదు.. రైతుల నుంచి ధాన్యం సేకరించేందుకు తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు కావాల్సి ఉంటుంది. జిల్లాలో ఇప్పటి వరకు 95 శాతం ఈ ప్రక్రియ పూర్తయిందని డీఎస్‌వో సత్యనారాయణ రాజు తెలిపారు. ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు లారీలు, వ్యానులకు 'జీపీఎస్' విధానాన్ని అమరుస్తున్నట్లు వివరించారు.

జిల్లాలో రైతులు	వరి సాగు	ధాన్యం దిగుబడి అంచనా	సేకరణ లక్ష్యం
79,018 మంది	5,75,530 ఎకరాలు	5.50 లక్షల టన్నులు	3.50 లక్షల టన్నులు

అటవీ శాఖ సిబ్బందిపై గ్రామస్థుల దాడి!

నలుగురికి గాయాలు

లింగపాలెం, న్యూస్‌టుడే: అటవీ భూముల ఆక్రమణపై ప్రశ్నించిన ఆ శాఖ సిబ్బందిపై ఏలూరు జిల్లా లింగపాలెం మండలం కలరాయనగూడెం గ్రామస్థులు కర్రలతో దాడిచేసిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి దాటాక చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని అటవీ భూమిని కొందరు సాగు చేసేందుకు దున్నుతుండగా.. అటవీ శాఖ సిబ్బంది అడ్డుకున్నారు. ఆ సమయంలో పది మంది వ్యక్తులు మూకుమ్మడిగా కర్రలతో విచక్షణారహితంగా దాడి చేయడంతో నలుగురు సిబ్బంది గాయపడ్డారు. పోలీసులకు సమాచారం అందడంతో చింతలపూడి సీఐ ఎం.రవీంద్ర, ధర్మాజీగూడెం ఎస్సై కె.వెంకన్న సంఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్థులను చెదరగొట్టి బాధితులకు ధర్మాజీగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స అందించి, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రక్షణ కల్పించారు. గ్రామంలోని వైకాపా నాయకుడి ప్రోద్బలంతోనే తమపై దాడి జరిగినట్లు అటవీ సిబ్బంది ఆరోపిస్తున్నారు. అయితే పోలీసులు అతడిని కేసు నుంచి తప్పించేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అటవీ సిబ్బందిపై దాడి చేసిన పది మందిపై కేసు నమోదు చేసినట్లు జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర తెలిపారు.



చెక్క, ఫైబర్‌తో తయారు చేసిన వేంకటేశ్వరస్వామి రథం ★ ఎద్దులబండి ★ అశ్వరథం

రథ శోభ!

దేవీ దేవతామూర్తుల ఉత్సవాలు, ఊరేగింపులు, శుభకార్యాలకు కావాల్సిన రీతుల్లో రథాలను ఇరగవరం మండలం రేలంగి గ్రామంలో సిద్ధం చేస్తున్నారు. స్టీల్, ఇనుము, ఫైబర్, చెక్క తదితర ముడి పదార్థాలతో బొమ్మలు తయారు చేసి ఆటోలు, జీపులు, ట్రాక్టరు తొట్టెలపై అమర్చుతున్నారు. వీటిని పూలదండలు, విద్యుద్దీపాలతో అందంగా ముస్తాబు చేసి అద్దెకు ఇస్తున్నారు. ఈ రథాల కోసం ఉమ్మడి గోదావరి జిల్లాలతోపాటు ఇతర జిల్లాల నుంచి ప్రజలు వస్తున్నారు. - ఈనాడు, ఇరగవరం

రత్నాచల్ 30 ఏళ్ల సంబరాలు

విజయవాడ, న్యూస్‌టుడే: విజయవాడ, విశాఖపట్నం మధ్య నడిచే రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభమై 30 సంవత్సరాలు పూర్తవడంతో బుధవారం విజయవాడ రైల్వేస్టేషన్‌లో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ రైలు అక్టోబరు 2వ తారీఖున 1994లో ప్రారంభమైంది. మొదట రత్నగిరి హిల్స్ పేరుతో నడిచేది. 1999 నుంచి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌గా మారింది. 2006 నుంచి ఈ రైల్లో అత్యాధునిక సౌకర్యాలు ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చాయి. సీబీసీ ర్యాక్‌లు, పూర్తి స్థాయిలో భద్రత, డబ్ల్యూఏపీ4 అత్యాధునిక ఇంజినుతో పాటు ప్రయాణికుల రద్దీ దృష్ట్యా రైలు వేగంతో పాటు 24 బోగీలకు పెంచారు. ఉదయం విజయవాడ నుంచి బయలుదేరి రాత్రికి తిరిగి చేరుకునే ఈ రైలుకు ప్రయాణికుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. రోజూ 140శాతం ఆక్యుపెన్సీ నమోదు చేసుకుంటుంది. ఉద్యోగులు, వ్యాపారులకు ఈ రైలు ఎంతో సౌకర్యవంతంగా మారింది. వేడుకల సందర్భంగా ప్రయాణికులు, రైల్వే సిబ్బంది విజయవాడ రైల్వేస్టేషన్‌లో కేక్ కోసి సంబరాలు నిర్వహించారు.



వేడుకల్లో పాల్గొన్న ప్రయాణికులు, రైల్వే సిబ్బంది

పశ్చిమలో మూడు కేంద్రాల్లో టెట్

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఈ నెల 5వ తేదీ నుంచి మూడు కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. భీమవరంలోని డీఎన్నార్ ఇంజినీరింగ్, డీఎన్నార్ అటానమస్, తాడేపల్లిగూడెం లోని వాసవి ఇంజినీరింగ్ కళాశాలలను పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేసినట్లు వివరించారు.



స్వచ్ఛ ప్రతిజ్ఞ చేస్తున్న వెట్రిసెల్వి, జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, ఎమ్మెల్యే చంటి, మేయర్ నూర్జహాన్ తదితరులు

'స్వచ్ఛతా హీ సేవ' విజయవంతం : కలెక్టర్

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా ప్రజల భాగస్వామ్యంతో 'స్వచ్ఛతా హీ సేవ'ను విజయవంతం చేసినట్లు కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో బుధవారం స్వచ్ఛతా హీ సేవ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, ఎమ్మెల్యే బడేటి చంటి, మేయర్ నూర్జహాన్ హాజరయ్యారు. తొలుత గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. అనంతరం స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. వారు మాట్లాడుతూ... దేశం, రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనించాలంటే పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. అంతకుముందు బాలికల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. 'స్వచ్ఛతా హీ సేవ'లో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి ధ్రువపత్రాలు అందజేశారు. పలువురు పారిశుద్ధ్య కార్మికులను సత్కరించి జ్ఞాపికలు ప్రదానం చేశారు. డీఆర్వో పుష్పమణి, జడ్పీ సీఈవో సుబ్బారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఖైదీలు గాంధీ జీవిత చరిత్ర చదవాలి



కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ ప్రతాప్ శివకిశోర్, జేసీ ధాత్రిరెడ్డి, న్యాయమూర్తులు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: క్షణికావేశంలో కొందరు, వ్యసనాలకు లోనై మరికొందరు నేరాలకు పాల్పడుతుంటారని, వారంతా గాంధీజీ జీవిత చరిత్ర చదివి పరివర్తన చెందాలని ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ సూచించారు. స్థానిక జిల్లా కారాగారంలో బుధవారం ఖైదీల సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. ఎస్పీ, జేసీ ధాత్రిరెడ్డి దంపతులు గాంధీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. వారు మాట్లాడుతూ... ఖైదీలు సత్ప్రవర్తనతో మెలిగి, భవిష్యత్తులో తలెత్తుకొని తిరగాలన్నారు. పరివర్తన చెందిన ఖైదీలకు ఏలూరులోని పోలీసు పెట్రోల్ బంక్‌లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. స్పెషల్ సెషన్స్ జ్యుడీషియల్ న్యాయమూర్తి ఎస్.ఉమాసునంద, రెండో అదనపు న్యాయమూర్తి మంగతాయారు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్ తదితరులు మాట్లాడారు. అనంతరం హేలాపురి సింగర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను ఖైదీలు తిలకించారు. జైలు సూపరింటెండెంట్ ఆర్.వి.స్వామి, జైలర్లు వెంకటరెడ్డి, శ్రీనివాసరావు, మహిళా పోలీసుస్టేషన్ సీఐ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కైకరం పిల్లలు.. క్రీడల్లో మెరికలు!

కైకరం (ఉంగుటూరు), న్యూస్‌టుడే

వారంతా పేద, మధ్య తరగతి కుటుంబాల్లో జన్మించారు. వారి అభ్యున్నతికి తల్లిదండ్రులు శ్రమిస్తున్నారు. కన్నవారి కలలను సాకారం చేసేందుకు పిల్లలు చక్కగా చదువుకుంటున్నారు. మరోవైపు తమకిష్టమైన క్రీడల్లో రాణిస్తున్నారు. ఇటీవల పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో పతకాలు సాధించి పలువురు మన్ననలు అందుకున్నారు. వారే ఉంగుటూరు మండలం కైకరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు. ప్రధానోపాధ్యాయుడు గుళ్ల ప్రసాదరావు పర్యవేక్షణలో పీడీలు నాగసుధ, ఇ.పాపాయమ్మ శిక్షణలో రాష్ట్ర స్థాయి పోటీలకు సన్నద్ధమవుతున్నారు. వారిపై న్యూస్‌టుడే కథనం.

వ్యాయామోపాధ్యాయ కొలువే లక్ష్యం



మా నాన్న మధు. ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నారు. ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన జిల్లా స్థాయి పోటీల్లో ట్రయాథ్లాన్-బి విభాగంలో కిడ్స్ జావలిన్‌త్రో, లాంగ్‌జంప్ ప్రథమ, షాట్‌పుట్ ద్వితీయ, 60 మీటర్ల పరుగులో తృతీయ స్థానాలు సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యా. ఖోఖోలోనూ ప్రావీణ్యముంది. ఆటలు బాగా ఆడి క్రీడా కోటాలో వ్యాయామ ఉపాధ్యాయుడి కొలువు సాధించడమే నా లక్ష్యం. - కాటి దీవెన కుమార్, ఏడో తరగతి

ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యం



మా అమ్మ నాగమ్మ, నాన్న రత్తయ్య. ఇద్దరూ వ్యవసాయ కూలీలు. నాకు ఆటలంటే బాల్యం నుంచే మక్కువ. షాట్‌పుట్, డిస్కస్ త్రో, త్రోబాల్ బాగా ఆడతాను. గతేడాది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యా. ఎస్‌జీఎఫ్ పోటీల్లో షాట్‌పుట్ విభాగంలో జిల్లా ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయికి అర్హత సాధించా. క్రీడా కోటలో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నా. ఆ దిశగా నిత్య సాధన చేస్తున్నా. - ఉల్లిబోయిన మేరీ, పదో తరగతి

పరుగంటే ఆసక్తి



నాకు చిన్నప్పటి నుంచి పరుగెత్తడం ఇష్టం. ఈ ఆసక్తిని గమనించి పాఠశాల పీడీలు నాగసుధ, పాపాయమ్మ ప్రత్యేక శిక్షణనిస్తున్నారు. గతేడాది 3 కిలోమీటర్ల పరుగులో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యా. ప్రస్తుతం 600 మీటర్ల పరుగు పందెంలో జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం కైవసం చేసుకొని రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించా. అక్కడా ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపిక అవుతానన్న నమ్మకం ఉంది. - మన్యం ఆంజనేయులు, పదో తరగతి

అమ్మ ప్రోత్సాహంతో..



మా నాన్న రత్నంరాజు మరణించారు. తల్లి మాధవి అన్నీతానై చదివిస్తోంది. ఆమె ప్రోత్సాహంతోనే హైజంప్ అండర్-16 విభాగంలో జిల్లాస్థాయి ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యా. అక్కడా రాణించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధిస్తానన్న నమ్మకం ఉంది. భారత సైన్యంలో కొలువు సాధించాలన్నది నా ఆశయం. - వై.ప్రేమ్‌కుమార్, పదో తరగతి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రభాకర్

రూ.300 కోట్ల పరిశ్రమకు శంకుస్థాపన

దెందులూరు, న్యూస్‌టుడే: దెందులూరు మండలం కంద్రికలో రూ.300 కోట్ల అంచనా వ్యయంతో హెచ్‌పీసీఎల్ సంస్థ నిర్మించనున్న బయోగ్యాస్ తయారీ ప్లాంటుకు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ బుధవారం శంకుస్థాపన చేశారు. తొలుత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్లాంటు ప్రాంగణంలో మొక్క నాటి నీరు పోశారు. ఆయన మాట్లాడుతూ... ప్లాంటు ఏర్పాటుతో గ్రామంలోని సుమారు 150 మందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు.

నిబంధనల ప్రకారమే దర్యాప్తు

కాళ్ల, న్యూస్‌టుడే: కస్టోడియల్ టార్చర్‌పై తాను ఇచ్చిన ఫిర్యాదుపై నిబంధనల ప్రకారం దర్యాప్తు చేశాక 30 రోజుల తర్వాత ఎఫ్ఐఆర్ నమోదు చేశారని ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు పేర్కొన్నారు. పెదఅమిరంలోని తన కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యనేత ఒత్తిడి ఉంటే ఎఫ్ఐఆర్ నమోదుకు 30 రోజుల సమయం పడుతుందా అని ప్రశ్నించారు. మూడు నెలల తర్వాత ఇప్పుడిప్పుడే ఈ కేసు కొలిక్కి వస్తుందన్నారు. న్యాయ వ్యవస్థపై ఉన్న నమ్మకంతోనే తాను ఈ పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తిరుమలలో తన కుమార్తె తరపున డిక్లరేషన్ ఇచ్చినట్లుగానే జగన్‌మోహన్ రెడ్డి కూడా ఇవ్వాలని సూచించారు. డిక్లరేషన్ ఇచ్చి శ్రీవారిపై నమ్మకం ఉందని చాటుకునే అవకాశాన్ని అవగాహన లేమి, అహంకారంతో జగన్ పోగొట్టుకున్నారన్నారు. స్వచ్ఛహీ సేవా కార్యక్రమం 15 రోజులకే పరిమితం కాకూడదని.. ఇది జీవన విధానంగా మారాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అందుకే తాను ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేయకముందే ఉండి నియోజకవర్గంలో కాలువల శుభ్రత, గట్లపై ఆక్రమణను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.

ధాన్యం కొనుగోలుకు పకడ్బందీ ఏర్పాట్లు: జేసీ

ఉంగుటూరు, న్యూస్‌టుడే: రైతులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ చేపట్టాలని సంయుక్త కలెక్టర్ ధాత్రిరెడ్డి సూచించారు. బాదంపూడి, వెల్లమిల్లి, నాచుగుంట ఆయకట్టులోని వరి చేలను బుధవారం ఆమె పరిశీలించారు. ధాన్యం సేకరణ ఎప్పట్నుంచి ప్రారంభిస్తే అనువుగా ఉంటుందని రైతుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ నెల 15 నాటికి కొనుగోలు కేంద్రాలు తెరవాలని, ధాన్యం బస్తాలు లోడ్ చేసిన లారీ బరువు కొలవడానికి పూళ్ల వెళ్లాల్సి వస్తోందని, దాంతో ఉంగుటూరు టోల్‌గేటు వద్ద పన్ను చెల్లించాల్సి పరిస్థితి నెలకొందని పలువురు రైతులు జేసీకి విన్నవించారు. అనంతరం బాదంపూడిలోని రైతు సేవా కేంద్రం, సొసైటీలను ఆమె సందర్శించి ధాన్యం సేకరణ ప్రక్రియపై సిబ్బందితో మాట్లాడారు. అనంతరం రావులపర్రులోని రైస్ మిల్లును పరిశీలించారు. మిల్లు సామర్థ్యం, గోనె సంచులు తదితరాలపై ఆరా తీశారు. ఆమె వెంట జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా, ఆర్డీవో అచ్యుత్ అంబరీష్, పౌరసరఫరాల సంస్థ ఎండీ శ్రీలక్ష్మి, డీఎస్‌వో సత్యనారాయణ రాజు, ఏడీఏ ఉషారాజకుమారి, తహసీల్దారు దుర్గాప్రసాద్, ఏవో ప్రవీణ్‌కుమార్ తదితరులున్నారు.

ఉపాధి హామీపై పుస్తకం విడుదల

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రచురించిన ఉద్యాన పంటల పెంపకం పుస్తకాన్ని బుధవారం కలెక్టర్ కె.వెట్రిసెల్వి విడుదల చేశారు. ఆమె మాట్లాడుతూ... ఉద్యాన పంటలకు ప్రభుత్వం అందించే ఆర్థిక సాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయిల్ పామ్ పంటకు ఉపాధిహామీ పథకం ద్వారా మూడేళ్లకు కలిపి రూ.55,770, ఉద్యాన శాఖ ద్వారా 60 మొక్కలకు ఎరువులు, మొక్కలకు కలిపి మెటీరియల్ రాయితీ ద్వారా రూ.28,860 చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ ఎ.రాము, జడ్పీ సీఈవో సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు భవనాల పనుల పూర్తికి కృషి



జీలుగుమిల్లిలో నూతన భవనాన్ని పరిశీలిస్తున్న ఈఈ విద్యాసాగర్

జీలుగుమిల్లి, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ హయాంలో నిధులు లేక అసంపూర్తిగా నిలిచిన పోలీసు భవనాల పనులను పూర్తి చేస్తామని పోలీస్ గృహ నిర్మాణ సంస్థ ఈఈ ఎంవీ విద్యాసాగర్ తెలిపారు. జీలుగుమిల్లిలో నూతన పోలీస్ భవన నిర్మాణాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. జిల్లాలో పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లిలో ఒక్కో భవనాన్ని రూ.2 కోట్లతో నిర్మిస్తున్నామని చెప్పారు. జనవరి నాటికి పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఇప్పటికే ఆచంటలో నిర్మాణం పూర్తయిందన్నారు. కార్యక్రమంలో డీఈ అబ్దుల్‌ఖాదర్, ఏఈ గోపీకృష్ణ, ఎస్సై నవీన్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంజుల

సమస్యల పరిష్కారానికి ఉద్యమ బాట

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఉద్యమ బాట తప్పదని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు సీహెచ్ మంజుల అన్నారు. స్థానిక సుబ్బమ్మదేవి పాఠశాలలో సంఘం ఆధ్వర్యాన బుధవారం అధ్యయన ఉద్యమ తరగతులు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ... విద్యా రంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి తమ సంఘం నిరంతర పోరాటాలు చేస్తోందన్నారు. ఉపాధ్యాయ పింఛను, గ్రాట్యుటీ, ఇంక్రిమెంట్ తదితర సౌలభ్యాలు సాధించామన్నారు. అనంతరం 'రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులు- విద్యా రంగంపై ప్రభావం'పై సంఘం రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పి.పాండురంగ వరప్రసాద్ ఉపన్యసించారు. 'ఉపాధ్యాయ ఉద్యమ చరిత్ర'పై సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి ప్రసంగించారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రామారావు, బి.రెడ్డిదొర, రాష్ట్ర కార్యదర్శి బీఏ సాల్మన్‌రాజు, బి.శ్యామ్‌సుందర్, జె.సోమేశ్వరశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులకు ఓట్ల పండగ

నవంబరు 6 వరకు దరఖాస్తుకు అవకాశం

ముదినేపల్లి, న్యూస్‌టుడే

ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల, ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గాల పరిధిలో ఓటర్ల జాబితాకు ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లా పరిధిలోనే ఓటరు నమోదు ప్రక్రియకు యంత్రాంగం చర్యలు చేపట్టింది. అర్హులైన పట్టభద్రులు నవంబరు 6 వరకు ఓటు నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. అర్హుల నుంచి ఫారం-18 ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. నవంబరు 6 వరకు నమోదు ప్రక్రియ పూర్తి చేసి 23న ముసాయిదా జాబితా ప్రచురిస్తారు. 29 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. డిసెంబరు 25 నాటికి అభ్యంతరాల పరిష్కారం పూర్తి చేసి 30న తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తారు.

2019 ఎన్నికల్లో..	ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా
	ఓటర్లు : 1, 21,379
	పోలింగ్ కేంద్రాలు : 133

దరఖాస్తు ఇలా..

- గతంలో పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు నమోదు చేసుకున్న ఓటు ప్రస్తుతం ఉండదు. అందరూ కచ్చితంగా నమోదు చేసుకోవాలి.
- 2021 అక్టోబరు నాటికి పట్టభద్రులైన వారు ఓటరుగా నమోదయ్యేందుకు అర్హులు.
- మండలపరిషత్తు, రెవెన్యూ కార్యాలయాల్లో ఫారం-18 దరఖాస్తు పొందాలి. గెజిటెడ్ అధికారితో ధ్రువీకరణ చేసిన డిగ్రీ ధ్రువపత్రం నకలు జతచేయాలి.
- రెండు పాసు పోర్టు సైజు ఫొటోలు అతికించాలి.
- ఆధార్‌కార్డు నకలు, చిరునామా ధ్రువపత్రం జత చేయాలి.
- సీఈవో ఆంధ్రా.ఎన్ఐసీ.ఇన్ వెబ్‌సైటులో ఆన్‌లైన్‌లో ఓటుకు దరఖాస్తు చేసుకోవచ్చు.

జిల్లా ఒక్కటి.. రెండు ఎమ్మెల్సీ ఎన్నిక..

జిల్లాల పునర్విభజనలో ఏర్పడిన ఏలూరు జిల్లాలో అటు ఉమ్మడిపశ్చిమగోదావరి జిల్లాతో పాటు కృష్ణా జిల్లాకు చెందిన రెండు మండలాలు ఉన్నాయి. కైకలూరు, నూజివీడు నియోజకవర్గాల పరిధిలోని ఎనిమిది మండలాల పట్టభద్రులు ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గంలోఉండటంతో ఆ ఓటరు జాబితాకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉండగా, మిగిలిన జిల్లా వారు ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల జాబితాకోసం దరఖాస్తు చేసుకోవాలి.

పదవీకాలం ముగియడంతో..

కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఉన్న కెఎస్.లక్ష్మణరావు పదవీకాలం, ఉభయ గోదావరి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు(ఐవీ) పదవీకాలం మార్చి 2025తో ముగుస్తుంది. దీంతో వీటి ఎన్నికకు ప్రక్రియ ప్రారంభించారు. 2019లో సార్వత్రిక ఎన్నికల ముందు కావడంతో ఇరు ప్రధాన పార్టీలు ఈ ఎన్నికపై పెద్దగా దృష్టి పెట్టలేదు. అయితే ఈసారి ఆ పార్టీలు ఈ ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. ఓటర్ల నమోదు ప్రక్రియకు ముందే అభ్యర్థులను సైతం ప్రకటించేయడంతో రాజకీయ వేడి మొదలైంది.

పురపాలక బడుల్లో ఉపాధ్యాయుల్ని నియమించాలి



సత్యాగ్రహ దీక్ష చేస్తున్న ఉపాధ్యాయులు

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: పురపాలక ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్ డిమాండ్ చేశారు. నగరంలో సంఘం ఆధ్వర్యాన బుధవారం సత్యాగ్రహ దీక్ష చేశారు. రవికుమార్ మాట్లాడుతూ... పురపాలక ఉన్నత పాఠశాలల్లో తగినంత మంది ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులకు పూర్తిస్థాయిలో బోధన అందడం లేదన్నారు. ఉపాధ్యాయుల్లో అర్హులైన వారిని ఎంఈవోలుగా నియమించాలని కోరారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. సంఘ నాయకులు శివశంకరరావు, బి.సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మకు.. నేడు స్వర్ణ కవచాలంకరణ



చండీహోమం నిర్వహిస్తున్న వేదపండితులు

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం సందర్భంగా పట్టణ ఇలవేల్పు మావుళ్లమ్మ గురువారం స్వర్ణ, రజత కవచాలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 12వ తేదీ వరకు అమ్మవారికి నిత్యం ప్రత్యేక అలంకరణలు, లక్ష కుంకుమార్చనలు నిర్వహించనున్నట్లు దేవస్థానం సహాయ కమిషనర్ బీఎం నగేశ్ తెలిపారు.

ఉక్కు పరిశ్రమ నిర్వీర్యానికి కేంద్రం కుట్ర

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు పరిశ్రమను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని పలువురు నాయకులు ఆరోపించారు. ఉక్కు పరిశ్రమ పోరాట వేదిక పిలుపు మేరకు స్థానిక వసంత మహల్ కూడలిలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద బుధవారం నిరసన దీక్ష చేపట్టారు. విశాఖ ఉక్కుకు సొంతంగా గనులు కేటాయించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని అంటూ నాయకులు చేశారు. వారు మాట్లాడుతూ... నష్టాలను సాకుగా చూపి వేలాది మంది ఒప్పంద కార్మికులను తొలగించేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందన్నారు. రూ.3 లక్షల కోట్ల సంపద కలిగిన పరిశ్రమను ప్రైవేటు సంస్థలకు అప్పగించాలని చూస్తే ఊరుకోబోమని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శులు డీఎన్‌వీడీ ప్రసాద్, కె.బుచ్చిబాబు, బి.వెంకటరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

భీమవరం బుల్లెమ్మ పెళ్లి పేరిట మోసం

బ్రోకర్లు, మహిళపై బాధితుడు స్టేషన్‌లో ఫిర్యాదు

హిందూపురం, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం గ్రామీణ మండలానికి చెందిన ఓ యువకుడికి దాదాపు 40 ఏళ్లు వచ్చినా వివాహం కాలేదు. ఇంట్లో తల్లిదండ్రులు పడుతున్న ఇబ్బందులు చూసిన అతడు వారిని సంతోషపెట్టాలని భీమవరం ప్రాంతానికి వెళ్లి అక్కడ బ్రోకర్లను ఆశ్రయించాడు. వారు రూ.లక్షలు దండుకొని ఓ మహిళతో వివాహం జరిపించారు. ఆమెను హిందూపురం తీసుకొచ్చినా అతడితో కాపురం చేయకుండా వాయిదా వేస్తూ వచ్చింది. వారం రోజుల తర్వాత తన తల్లిదండ్రులకు ఆరోగ్యం బాగోలేదని వెంటనే వెళ్లాలని చెప్పింది. దీనికి అతను నిరాకరించడంతో ఆత్మహత్య చేసుకొంటానని బెదిరించడంతో ఆమెను తీసుకొని భీమవరానికి రైలులో వెళ్లాడు. రైల్వేస్టేషన్‌లో దిగిన వెంటనే ఆమె మన వివాహం మా తల్లిదండ్రులకు తెలియదని, వారికి తెలిస్తే చాలా ఇబ్బందని, ఇక్కడే ఉండు వస్తానని చెప్పి వెళ్లింది. అంతే ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి మూడు, నాలుగు రోజులు గడిచినా రాకపోవటంతో వెనుదిరిగిన అతను చేసేది లేక బుధవారం బ్రోకర్లు, మహిళ మోసం చేసిందని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటన పట్టణంలో చర్చనీయాంశమైంది.

చింతలపూడిలో అత్యధిక వర్షపాతం

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో మంగళవారం ఉదయం 8.30 నుంచి బుధవారం ఉదయం 8.30 గంటల మధ్య 1.3 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైందని ఇన్‌ఛార్జి సీపీవో బి.శ్రీదేవి తెలిపారు. చింతలపూడి మండలంలో అత్యధికంగా 36.0 మి.మీ. వర్షం కురిసినట్లు ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆయిల్ పామ్ టన్నుకు రూ.18 వేలు ఇవ్వాలి

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఆయిల్ పామ్ టన్ను దిగుబడికి రూ.18 వేలు ఇవ్వాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక అన్నేభవన్‌లో ఆయిల్ పామ్ రైతుల సమస్యలపై బుధవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆంధ్రతో పోలిస్తే తెలంగాణలో ఆయిల్ పామ్ గెలలకు ఎక్కువ ధర ఉందన్నారు. టన్ను గెలల ఉత్పత్తికి రూ.18 వేలు ఖర్చవుతోందన్నారు. సెప్టెంబరులో రూ.14,590, ఆగస్టులో రూ.13,883 చొప్పున టన్ను ధర పలికిందన్నారు. ఫలితంగా రైతులు నష్టాలు చవిచూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పెదవేగిలోని ఆయిల్ ఫెడ్ కర్మాగారాన్ని ఆధునికీకరించాలని ఆయన కోరారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)

(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -116 రిటైల్ ధర 138 చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 123, 132, 143 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

హెడ్ కానిస్టేబుల్‌పై దాడి

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: రాత్రి విధులు నిర్వర్తిస్తున్న ఓ హెడ్ కానిస్టేబుల్‌పై ముగ్గురు దాడికి పాల్పడిన ఘటన నగర శివారులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... పెదపాడు పోలీసుస్టేషన్‌లో చింతపల్లి కృష్ణ హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి హోంగార్డు నాగేశ్వరరావుతో కలిసి రాత్రి బీట్ వన్ విధులు నిర్వహిస్తున్నారు. ఒకటిన్నర గంటల సమయంలో తాళ్లమూడి సమీప ఓ దాబా వద్ద గొడవ జరుగుతున్నట్లు సమాచారం అందింది. ముగ్గురు వ్యక్తులు గొడవ పడుతుండగా... వారిని కృష్ణ ప్రశ్నించారు. దాంతో వారు దుర్భాషలాడుతూ ముఖం, ఛాతిపై పిడిగుద్దులు కురిపించారు. హోంగార్డు అడ్డుకునే ప్రయత్నం చేయగా- అతడిపైనా దాడి చేసి పరారయ్యారు. క్షతగాత్రుడ్ని 108 వాహనంలో ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. తాళ్లమూడికి చెందిన కంభం విజయ్, అజయ్, జగదీశ్ దాడి చేసినట్లు పోలీసులు గుర్తించారు.

ఆటోను ఢీకొట్టిన వ్యాను

ఇద్దరు కూలీలకు గాయాలు



బుట్టాయగూడెం కూడలి వద్ద బోల్తాపడిన వ్యాను

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: రోడ్డుపైకి అకస్మాత్తుగా వచ్చిన ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి వ్యాను బోల్తా పడటంతో పాటు ఎదురుగా వస్తున్న మరో ఆటోను ఢీకొట్టిన ఘటన పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. అశ్వారావుపేట నుంచి రాజమహేంద్రవరం వైపు వెళుతున్న వ్యాను.. దేవరపల్లి-తల్లాడ జాతీయ రహదారిపై జంగారెడ్డిగూడెంలోని బుట్టాయగూడెం కూడలి వద్దకు రాగానే.. ద్విచక్ర వాహన దారుడు అకస్మాత్తుగా జాతీయ రహదారిపైకి వచ్చాడు. అతడిని తప్పించే క్రమంలో వ్యాను చోదకుడు వాహనాన్ని పక్కకు తిప్పగా అదుపుతప్పి బోల్తా పడింది. అదే సమయంలో జీలుగుమిల్లి వైపు కూలీలతో వెళుతున్న ఆటోను ఓ పక్కగా ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న బయ్యనగూడేనికి చెందిన కూలీలు రాఘవులు, వెంకటేశ్‌లకు రక్త గాయాలయ్యాయి. వారిని స్థానికులు జంగారెడ్డిగూడెం ప్రాంతీయాసుపత్రికి తరలించారు.

నరసాపురంలో పులస కిలో రూ.2 వేలు

నరసాపురం, న్యూస్‌టుడే: నరసాపురం మార్కెట్లో పులస చేపలు కిలో రూ.2 వేలు చొప్పున విక్రయిస్తున్నారు. వ్యాపారులు ఒడిసా నుంచి తీసుకొచ్చిన పులసలను విక్రయించారు. పలువురు మాంసాహార ప్రియులు వీటిని కొనుగోలు చేసి తీసుకెళ్లారు.



ఏలూరు

●ఏలూరు ●దెందులూరు ●ఉంగుటూరు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

ఏలూరు తూర్పువీధి: 80081 23847 | ఏలూరు గ్రామీణ: 80085 74535
పెదపాడు, పెదవేగి: 80085 74483 | ఉంగుటూరు: 79933 00492

ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే

సమస్య: ఫిల్‌హౌస్‌పేట ఏడు కాలువల కూడలి వద్ద మురుగు కాలువలను నెలలుగా శుభ్రం చేయడం లేదు. కాలువలు పూడికతో నిండిపోయి మురుగు ముందుకెళ్లడం లేదు. **- సీహెచ్ విశ్వనాథం, స్థానికుడు**

సమాధానం: పారిశుద్ధ్య సిబ్బందిని పంపి కాలువల్లో పూడిక తీయిస్తాం. **- శివరెడ్డి, నగరపాలక ఉప అధికారి**

సమస్య: కొత్తపేట సబ్బువరపువారి వీధిలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నారు. ఏకంగా ఇళ్లలోకి ప్రవేశించి దాడులు చేస్తున్నాయి. పలువురు కుక్కకాటుకు గురై చికిత్సలు చేయించుకున్నారు. **- పెదిరెడ్డి నారాయణ, స్థానికుడు**

సమాధానం: నగరంలో వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటాం. **- జి.చంద్రయ్య, నగరపాలక సహాయాధికారి**

సమస్య: సత్రంపాడు ఆర్టీసీ ఎంప్లాయీస్ కాలనీ ప్రధాన రోడ్డులోని కాలువలో మురుగు సరిగా పారడం లేదు. దీంతో దుర్వాసన రావడంతో పాటు దోమల బెడద అధికంగా ఉంటోంది. **- డి.వెంకటేశ్వరరావు, స్థానికుడు**

సమాధానం: కాలువలో పూడిక తీయించి, దోమల నివారణకు మందు పిచికారీ చేయిస్తాం. **- జి.చంద్రయ్య, నగరపాలక సహాయాధికారి**

పెదవేగి, న్యూస్‌టుడే

సమస్య: స్థానిక తహసీల్దారు కార్యాలయం నుంచి కూచింపూడి వెళ్లే మార్గం గుంతలు పడి ప్రమాదకరంగా తయారైంది. రాత్రి వేళ గోతులు కనిపించక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. **- వాహన చోదకులు**

సమాధానం: రహదారిని పరిశీలించి గుంతలను పూడ్పించేందుకు చర్యలు తీసుకుంటాం. **- బలరాం, ర.భ.శాఖ ఏఈ**

చెత్తాచెదారాల తొలగింపు

స్పందనకు వందనం

ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే: అశోకనగర్‌లోని అశోకగోవర్ధన నగరపాలకోన్నత పాఠశాల ప్రహరీని ఆనుకొని పడేస్తున్న చెత్తాచెదారాలను పారిశుద్ధ్య సిబ్బంది ఎట్టకేలకు తొలగించారు. రోజుల తరబడి వ్యర్థాలు పేరుకుపోవడంపై 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన గత నెల 26న వార్త ప్రచురితమైంది. నగరపాలక అధికారి భానుప్రతాప్ స్పందించి పారిశుద్ధ్య సిబ్బందితో వ్యర్థాలు తొలగింపజేశారు.

● కొత్తపేట నూకాలమ్మ ఆలయం వెనుక రోడ్డులోని మురుగు కాలువలో సిబ్బంది పూడిక తీశారు. కాలువలు చెత్తాచెదారం నిండిపోయి దుర్వాసన రావడంపై గత నెల 25న ప్రచురితమైన వార్తకు నగరపాలక అధికారి భానుప్రతాప్ స్పందించారు. పారిశుద్ధ్య సిబ్బందిని పంపి కాలువలో పూడిక తీయించి, దోమల నివారణకు మందు పిచికారీ చేయించారు.

ఘనంగా కేంద్ర మాజీ మంత్రి జన్మదినం

ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే: స్థానిక భాజపా జిల్లా కార్యాలయంలో బుధవారం కేంద్ర మాజీ మంత్రి, భాజపా నాయకుడు కావూరి సాంబశివరావు జన్మదిన వేడుకలు నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు చౌటుపల్లి విక్రమ్ కిశోర్ ఆధ్వర్యంలో నాయకులు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. నాయకులు దాన భాస్కరరావు, కృష్ణ ప్రసాద్, నారాయణరావు, శివ, గణపతి, కుసుమ పాల్గొన్నారు.

'రోజా వ్యాఖ్యలు విడ్డూరం'

ఉంగుటూరు, న్యూస్‌టుడే: ఎంపీ, భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిపై మాజీ మంత్రి రోజా వ్యాఖ్యలు విడ్డూరమని ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ మాలతీరాణి అన్నారు. శ్రీవారి దర్శన టిక్కెట్లు అమ్ముకున్న రోజాకు తిరుమల పవిత్రతపై మాట్లాడే అర్హత లేదని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

గుండుగొలను(భీమడోలు), న్యూస్‌టుడే: గుండుగొలనులోని శ్రీవిఘ్నేశ్వర దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన 60 మంది దివ్యాంగులకు దాతలు నెల రోజులకు సరిపడా నిత్యావసర సరకులను బుధవారం పంపిణీ చేశారు.

గణనాథునికి ప్రత్యేక పూజలు



ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: సత్రంపాడులోని లక్ష్మీగణపతి ఆలయంలో విఘ్నేశ్వరస్వామికి బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. గరిక, వివిధ రకాల పుష్పాలతో విశేషాలంకరణ చేపట్టారు. వంకాయలతో చేసిన మాలను స్వామికి అలంకరించారు. ● మహాలయ అమావాస్య సందర్భంగా సత్రంపాడులోని సౌభాగ్యలక్ష్మీదేవి, అంబికాదేవి ఆలయాల్లో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. పెద్దఎత్తున భక్తులు జలాలు తీసుకొచ్చి అమ్మవారికి అభిషేకం నిర్వహించారు.

కాలనీలు నిర్మించి.. దారులు విస్మరించి!

ఇబ్బందులు పడుతున్న స్థానికులు



గుండుగొలను కాలనీలో అధ్వానంగా రహదారి

న్యూస్‌టుడే - గుండుగొలను (భీమడోలు)

ఏళ్ల తరబడి సొంతిల్లు లేక అవస్థలు పడ్డారు.. ప్రభుత్వమిచ్చిన స్థలాల్లో పేదలు ఇళ్లు నిర్మించుకున్నారు. . పేదల కాలనీల్లో కనీస సదుపాయాలు కల్పించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుండుగొలను, భీమడోలులోని పేదలకు కేటాయించిన కాలనీల్లో వందలాది ఇళ్లు నిర్మించుకుని వేలాది మంది నివాసముంటున్నారు. ఆయా కాలనీలకు వెళ్లాలంటే ఏలూరు కాలువ గట్టే దిక్కు. అది మట్టి రోడ్డు కావడంతో.. చిన్నపాటి వర్షానికే చిత్తడిగా మారుతోంది.

మురికి కూపంగా రోడ్లు

గుండుగొలనులో 1,147 మంది పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించారు. ఇప్పటి వరకు 854 మంది గృహ నిర్మాణాలు పూర్తి చేశారు. భీమడోలులో దిగుడుపాటిదిబ్బలు ప్రాంతంలో కేటాయించిన స్థలాల్లో 326 మంది గృహ నిర్మాణాలు చేపట్టారు. ఆయా కాలనీల్లో మురుగునీటి పారుదలకు కాలువలు లేకపోవడంతో అటు వర్షపు నీరు, ఇటు వాడుక నీరు రహదారులపైనే నిలిచిపోయి మురికి కూపాన్ని తలపిస్తోంది. పక్కా రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు చేసినా, అది కాస్త కార్యరూపం దాల్చలేదు. 'గుండుగొలను, భీమడోలు కాలనీల్లో రహదారులు అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు చొరవ చూపారు. ఆయన సూచనతో తాజాగా రూ.2 కోట్ల అంచనా వ్యయంతో మరోసారి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం' అని గృహ నిర్మాణ సంస్థ ఏఈ వెంకటేశ్వరరావు తెలిపారు.



దిగుడుపాటిదిబ్బలు కాలనీకి వెళ్లేందుకు గ్రామస్థుల ఇక్కట్లు

గురువుల పాత్ర కీలకం

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. స్థానిక హేలాపురి బ్రాహ్మణ సామాజిక భవనంలో ఏపీ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం(అపుస్మా) జిల్లా శాఖ ఆధ్వర్యాన బుధవారం ఉపాధ్యాయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.శివకుమార్ ఆధ్వర్యాన 147 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. ఏలూరు డీవైఈవో ఎ.రవిప్రకాశ్, ఎంఈవో-2 ఆర్.రంగయ్య, అపుస్మా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంబీఎస్ శర్మ, రాష్ట్ర రీజనల్ అధ్యక్షుడు బాలాజీ, నాయకులు పాల్గొన్నారు.

నిడమర్రు: సమాజ నిర్దేశకులు ఉపాధ్యాయులేనని... విద్యార్థులను భావి పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత వారిపైనే ఉందని ఎంఈవోలు పి.శేషు, జి.బాలయ్య అన్నారు. బావాయిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కసిరెడ్డి హరినాథ్ ఉద్యోగ విరమణ సందర్భంగా బుధవారం సరిపల్లెలో సన్మాన సభ నిర్వహించారు. ఆయన్ను పలువురు ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.

యాజమాన్య పద్ధతులతో దిగుబడులు

నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: రైతులు యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా సూచించారు. చానమిల్లి, అడవికొలను, బావాయిపాలెం గ్రామాల్లో బుధవారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో సాగవుతున్న వరి పంటలను పరిశీలించారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారిణి గీతాదేవి, రైతులు ఉన్నారు.

డిమాండ్లు నెరవేర్చాలి

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: పురపాలక సంఘ కార్మికుల అపరిష్కృత డిమాండ్లు నెరవేర్చాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో బుధవారం సంఘ నాయకుల సమావేశం నిర్వహించారు.

బాధ్యతాయుతంగా తెదేపా సభ్యత్వ నమోదు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: తెదేపా సభ్యత్వ నమోదును బాధ్యతాయుతంగా చేపట్టాలని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. స్థానిక పవరుపేటలోని విడిది కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో బుధవారం సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గంలో గురువారం నుంచి సభ్యత్వ నమోదు మొదలు కానుందన్నారు. సభ్యత్వ నమోదు లేకుంటే పార్టీ పదవులకు అనర్హులుగా ప్రకటిస్తారన్నారు. నియోజకవర్గంలో ప్రక్రియను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వైకాపా కల్తీ మద్యానికి పేదలు బలి: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న చింతమనేని

దెందులూరు, న్యూస్‌టుడే: వైకాపా కల్తీ మద్యానికి అనేక మంది పేదలు బలయ్యారని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆరోపించారు. ముప్పవరంలో 'స్వచ్ఛతా హీ సేవ' గ్రామసభ బుధవారం నిర్వహించారు. తొలుత మహాత్మాగాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ... అయిదేళ్ల వైకాపా పాలనలో రాష్ట్రాన్ని యథేచ్ఛగా దోచుకున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో కల్తీ మద్యం తాగి అనేక మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారన్నారు. దాంతో బాధిత కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ఈ నెల 12 నుంచి ఎన్డీయే ప్రభుత్వం నూతన మద్యం విధానం అమలులోకి తీసుకొస్తోందని ఆయన తెలిపారు.

పారిశుద్ధ్యం మెరుగుపడకుంటే చర్యలు: కలెక్టర్



మురుగు నిలిచిపోవడంపై అధికారిని ప్రశ్నిస్తున్న వెట్రిసెల్వి

దెందులూరు, న్యూస్‌టుడే: కొవ్వలి సాంఘిక సంక్షేమశాఖ బాలుర వసతి గృహాన్ని కలెక్టర్ కె.వెట్రిసెల్వి తనిఖీ చేశారు. వసతి గృహంలో మురుగునీటి పారుదల సమస్యను పరిష్కరించాలని గత నెల 26న ఆమె అధికారులను ఆదేశించారు. పనుల తీరుతెన్నులు పరిశీలించేందుకు బుధవారం సందర్శించారు. వసతి గృహం ఆవరణలో మురుగు పేరుకుపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మురుగు పారుదల సమస్య తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మరోమారు స్పష్టం చేశారు. దెబ్బతిన్న పైపులైన్లు, తలుపులు, కిటికీలు మార్చాలని.. ప్రతిపాదనలు పంపితే వెంటనే నిధులు కేటాయిస్తామని పేర్కొన్నారు. కలెక్టర్ వెంట సాంఘిక సంక్షేమ శాఖ జేడీ జయప్రకాశ్, ఆర్డీవో అచ్యుత్ అంబరీష్ తదితరులున్నారు.

ఏలూరు టూటౌన్: కాలువల్లో పేరుకుపోయిన మురుగు యుద్ధప్రాతిపదికన తొలగించాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. అమీనాపేట బాలికల వసతి గృహ సముదాయాన్ని ఆమె పరిశీలించారు. అక్కడ కాలువలు, పలు సమస్యలపై ఆరా తీశారు. శిథిలావస్థకు చేరిన బీసీ బాలికల కళాశాల విద్యార్థినుల వసతిగృహాన్ని వెంటనే ప్రైవేటు భవనంలోకి మార్చాలని బీసీ సంక్షేమాధికారిణి నాగరాణికి సూచించారు.

ఉపాధి నిధులతో గ్రామీణాభివృద్ధి

ఉంగుటూరు, న్యూస్‌టుడే: ఉపాధి నిధులతో గ్రామాలను అభివృద్ధి చేయాలని ఎంపీడీవో రాజ్‌మనోజ్ సూచించారు. స్థానిక సామాజిక భవనంలో సర్పంచి సింధు అధ్యక్షతన ఉపాధి పనుల ప్రణాళికపై బుధవారం గ్రామ సభ నిర్వహించారు. పారిశుద్ధ్య కార్మికులను ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, ఉప సర్పంచి జగదీశ్, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్ సత్కరించారు.

భీమడోలు: పోలసానిపల్లిలో ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, సర్పంచి షేక్ రహీమా బేగం హసీనా కార్మికులను సత్కరించారు.

గణపవరం: గణపవరంలో స్వచ్ఛతా హీ సేలో భాగంగా పారిశుద్ధ్య కార్మికులను సర్పంచి మూరా అలంకారం, కార్యదర్శి శివరామ ప్రసాద్ సత్కరించారు.

పెదపాడు, పెదవేగి: నడిపల్లిలో సర్పంచి అప్పాయమ్మ, పునుకొల్లులో సర్పంచి సునీల్‌శ్రీ కృష్ణ అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు.

మహాత్ముని అడుగు జాడల్లో నడుద్దాం

ఘనంగా గాంధీ, శాస్త్రి జయంతి వేడుకలు

ఏలూరు, ఉంగుటూరు, దెందులూరు నియోజకవర్గాల్లో మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఏలూరులోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ప్రతాప్ శివకిశోర్, పవరుపేటలోని విడిది కార్యాలయంలో ఎమ్మెల్యే బడేటి చంటి, నగరపాలక సంస్థ కార్యాలయంలో మేయర్ నూర్జహాన్, భాజపా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిశోర్, సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ డాక్టర్ బీవీ కృష్ణారెడ్డి, జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సంస్థ కార్యదర్శి శేఖర్‌బాబు గాంధీజీ చిత్రపటాలు, విగ్రహాలకు నివాళులర్పించారు. ఉంగుటూరులో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, భీమడోలు గాంధీబొమ్మ కూడలిలో తెదేపా జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు గాంధీ విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు. **- న్యూస్‌టుడే బృందం**



ఏలూరులో చిత్రపటాలకు సెల్యూట్ చేస్తున్న ఎస్పీ



ఉంగుటూరు: గాంధీ విగ్రహానికి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు



భీమడోలు: పుష్పాంజలి ఘటిస్తున్న గన్ని



ఏలూరు: భాజపా నాయకుల ఆధ్వర్యంలో..

కోళ్ల వ్యర్థాల తరలింపు... లారీలు స్వాధీనం

పెదపాడు, న్యూస్‌టుడే: చేపల చెరువులకు కోళ్ల వ్యర్థాలు రవాణా చేస్తున్న నాలుగు లారీలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కె.ఎస్.సతీశ్ బుధవారం తెలిపారు. ఆయన కథనం మేరకు... విజయవాడ, హైదరాబాద్ నగరాల నుంచి సేకరించిన కోళ్ల వ్యర్థాలను మండలంలోని చేపల చెరువులకు మేతగా వేసేందుకు లారీల్లో తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. పలువురిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు.

పెదపాడు: మూగజీవాలను అక్రమంగా రవాణా చేస్తున్న లారీని పట్టుకున్నట్లు ఎస్సై కె.ఎస్.సతీశ్ బుధవారం తెలిపారు. ఆయన కథనం మేరకు... కాకినాడ జిల్లా తుని నుంచి పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు 48 ఆవు దూడలను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం వచ్చింది. కలపర్రు టోల్‌ప్లాజా వద్ద పోలీసులు తనిఖీలు చేసి లారీని గుర్తించారు. లారీని స్వాధీనం చేసుకొని... దూడలను ఏలూరులోని గోశాలకు తరలించారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

ఏలూరు నేర వార్తలు, న్యూస్‌టుడే: పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన గ్రామీణ మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. . ప్రత్తికోళ్లలంకకు చెందిన సైదు ఉదయ్ కిరణ్(23) తండ్రి మందలించాడన్న మనస్తాపంతో బుధవారం అర్ధరాత్రి పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి హుటాహుటిన ఏలూరు సర్వజన ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు అత్యవసర విభాగంలో చికిత్సనందిస్తుండగా యువకుడు మృతి చెందారు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: అంధ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ బ్లైండ్ సంఘం నాయకులు కోరారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో బుధవారం సంఘ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు పి.సురేశ్‌బాబు మాట్లాడుతూ... ముఖ ఆధారిత హాజరు నుంచి అంధ ఉపాధ్యాయులను మినహాయించాలని కోరారు. నాయకులు జగదీశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత దీక్షకు సంఘీభావంగా జూట్‌మిల్లు సమీప ధర్మభేరి ప్రాంగణంలో జనసేన నాయకులు వివిధ కార్యక్రమాలు చేపట్టారు. నారా శేష దంపతులు ఆధ్వర్యంలో వేంకటేశ్వర స్వామివారి నగర సంకీర్తన చేశారు. అగ్రహారంలోని జనార్దనస్వామి, గీతా భవన్, పడమరవీధిలోని వేంకటేశ్వర స్వామి తదితర ఆలయాలను సందర్శించి మొక్కులు తీర్చుకున్నారు.

ఉంగుటూరు: తిరుమల లడ్డూ ప్రసాదం అపవిత్రతపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ 11 రోజులపాటు చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా బుధవారం నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యాప్తంగా చేపట్టిన ధార్మిక కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో నాయకులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి వేడుకలకు ఆలయాల ముస్తాబు



విద్యుద్దీపాలతో కాంతులీనుతున్న పంచాయతన క్షేత్రం

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి వేడుకలకు అమ్మవారి ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆలయాలను విద్యుద్దీపాలతో రమణీయంగా అలంకరించారు. గురువారం నుంచి అమ్మవార్లకు రోజుకో అలంకరణ చేయనున్నారు. సత్రంపాడులోని అంబికాదేవి, సౌభాగ్యలక్ష్మీదేవి, పత్తేబాద, బావిశెట్టివారిపేటలోని కనకదుర్గమ్మ, దక్షిణపువీధిలోని పెద్దమ్మవారి ఆలయాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వెంకటాపురం శివారు శివనగర్‌లోని భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో రోజూ సాయంకాలం ప్రదోష కాలంలో సామూహిక కుంకుమ పూజలు చేయనున్నట్లు అర్చకులు తెలిపారు.

నిడమర్రు: మందలపర్రులోని ఉమా నీలకంఠేశ్వరస్వామి పంచాయతన క్షేత్రం దసరా ఉత్సవాలకు ముస్తాబైంది. బెజవాడ కనకదుర్గమ్మ ఆలయం తరహాలో ఇక్కడ అమ్మవారికి అలంకరణ, నైవేద్యాలు సమర్పించనున్నారు. పెదనింద్రకొలను, పత్తేపురం, దేవరగోపవరం గ్రామాల్లోని అమ్మవార్లకు రోజుకో అలంకరణ చేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

పోలవరం
•పోలవరం • చింతలపూడి

విద్యుత్తు వినియోగంపై అవగాహన సదస్సు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: విద్యుత్తు భద్రతా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుట్టాయగూడెం మండలం తూర్పురేగులకుంటలో ఆ శాఖ డీఈ రాధాకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం విద్యుత్తు వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆదా చేయడం తదితర అంశాలు వివరించారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామంలో ప్రతి ఇంటికి విద్యుత్తు కనెక్షన్ కలిగి ఉండటంపై అభినందిస్తూ.. సర్పంచి వెంకాయమ్మకు ప్రశంసాపత్రం అందజేశారు. ఏడీఈ వేణుగోపాలకృష్ణ, ఏఈ శ్రీనివాస వర్మ, సబ్ ఇంజినీర్ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం సర్కిల్‌లో 16 మద్యం దుకాణాలు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 16 మద్యం దుకాణాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని సీఐ కె.శ్రీనుబాబు బుధవారం తెలిపారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో 7, గ్రామీణ మండలంలో 4, జీలుగుమిల్లి 2, కుక్కునూరు మండలంలో 2, వేలేరుపాడులో ఒకటి చొప్పున ఉన్నాయన్నారు. వీటిలో నాలుగు దుకాణాలు గిరిజనులకు రిజర్వు చేశారు. కుక్కునూరులో ఒకటి, జీలుగుమిల్లి 2, వేలేరుపాడు 1 చొప్పున కేటాయించారన్నారు. వీటి కోసం ఈ నెల 9న సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రూ.2లక్షల డీడీ లేదా చలానా చెల్లించాలన్నారు. ఈ మొత్తం (నాన్ రిఫండ్‌బుల్) తిరిగి చెల్లించరని పేర్కొన్నారు.

నేటి నుంచి దసరా ధ్యానం

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకొని స్థానిక గౌరీ సుభద్ర పిరమిడ్ వద్ద తొమ్మిది రోజుల పాటు సామూహిక ధ్యానం నిర్వహించనున్నట్లు పిరమిడ్ ట్రస్టు ప్రతినిధి కొలనువాడ శిరీష తెలిపారు. ఈ నెల 3 నుంచి 11 వరకు రోజూ ఉదయం 5 నుంచి 7 గంటల వరకు సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ధ్యానం ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.✪ దసరా ఉత్సవాల్లో భాగంగా జంగారెడ్డిగూడెం నూకాలమ్మ గ్రామోత్సవం గురువారం ఉదయం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ రాజాన పండు తెలిపారు.



కుంకుళ్లమ్మ ఆలయంలో.. **ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే:** ద్వారకాతిరుమల క్షేత్ర దేవత కుంకుళ్లమ్మ ఆలయం దసరా నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. ఈ నెల 3 నుంచి 12 వరకు అమ్మవారు రోజుకో ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

గ్రామీణ నీటి సరఫరా డీఈఈగా రమేశ్

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: గ్రామీణ నీటి సరఫరా విభాగం కొయ్యలగూడెం సబ్ డివిజన్ డీఈఈగా సీహెచ్ రమేశ్ నియమితులయ్యారు. అలాగే ఏఈగా ఎస్.మురళీకృష్ణ బాధ్యతలు స్వీకరించారు.

కుట్టు యంత్రాల పంపిణీ

జీలుగుమిల్లి, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం హోప్ మినిస్ట్రీస్ సహకారంతో మండలంలోని బర్రింకలపాడులో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ద్వారా పలువురు మహిళలకు బుధవారం కుట్టు యంత్రాలు అందజేశారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: తలసేమియా వ్యాధితో బాధపడుతున్న ద్వారకాతిరుమల మండలం కొమ్మర చెందిన బాలుడు(11) వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.10 లక్షల చెక్కును ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు లంకా సత్యనారాయణ, మానూరి బాలకృష్ణ, చందు తదితరులు పాల్గొన్నారు.

పలువురి వితరణ

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: మంగపతిదేవిపేటలో అనారోగ్యంతో బాధపడుతున్న ముగ్గురికి తెదేపా, జనసేన నాయకులు 25 కిలోల చొప్పున బియ్యం, ఒక్కొక్కరికి రూ.2వేల నగదు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి అబ్బు సుబ్రహ్మణ్యం, గన్నమని రత్నాజీ, ఇళ్ల రాయుడు, వేల్పుల గంగాధరం, నిమ్మగడ్డ అప్పారావు, గంగరాజు పాల్గొన్నారు.✦ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి రెండు కాళ్లు కోల్పోయిన కొత్తూరు పునరావాస కాలనీకి చెందిన కంచుమర్తి శ్రీనివాస్, గవరవరం గ్రామానికి చెందిన తప్పెట్ల శ్రీనివాస్‌కు కొయ్యలగూడెం స్పందన స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బలుసు నాగేశ్వరరావు ప్రతి నెలా అందజేస్తున్న రూ.వెయ్యి బుధవారం అందజేశారు.

శ్మశానంలో సాగు!

అధికారులకు పట్టని అక్రమం

జీలుగుమిల్లి, న్యూస్‌టుడే: గ్రామంలో ఎవరైనా చనిపోతే అంత్యక్రియలు నిర్వహించేందుకు ఆరడుగుల జాగా కోసం వెతుక్కోవాల్సిందే. అయితే చెరువు.. లేకుంటే.. సొంత భూముల్లో నిర్వహించుకోవాల్సిందే. అలా అని శ్మశానానికి ప్రభుత్వ భూమి లేక కాదు.. దస్త్రాల్లో ఉంటుంది.. కాకపోతే ప్రత్యక్షంగా కనిపించదు. దాన్ని బయటకు తీయాలన్న ఆలోచన కూడా అధికారులకు రాదు. ఇంకే ముంది ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని కొందరు సదరు భూమిని ఆక్రమించి కౌలుకు ఇచ్చి దర్జాగా పంటలు సాగు చేయిస్తున్నారు. ఈ తంతు జీలుగుమిల్లి మండలం తాటియాకులగూడెంలో ఏళ్ల తరబడి జరుగుతోంది. గ్రామ సమీపంలో 18/1 సర్వే నంబరులో 1.99 ఎకరాల శ్మశాన భూమి ఉంది. దీన్ని ఆ గ్రామానికి చెందిన కొందరు ముఖ్యులుగా విభజించి వారికి ఇష్టమున్న రైతులకు కౌలుకిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయమై ఎనిమిది నెలల కిందట 'అంతిమ మజిలీకి అవస్థలే' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. మరుసటి రోజు మార్చి 1న రెవెన్యూ, పంచాయతీ అధికారులు ఆగమేఘాల మీద విచారణ చేపట్టారు. ప్రభుత్వ భూమే అని నిర్ధారించుకుని అక్రమార్కులకు నోటీసులు జారీ చేశారు. అనంతరం పట్టించుకోవడం మానేశారు. వారి అలసత్వాన్ని ఆసరాగా చేసుకున్న అక్రమార్కులు.. దర్జాగా వరి సాగు చేయిస్తున్నారు. దీనిపై గ్రామస్థులు అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. ఒక మూలన కొద్దిపాటి స్థలం వదలడంతో వర్షాలు లేని రోజుల్లో అక్కడే దహన సంస్కారాలు చేస్తున్నారు. ఒకేరోజు ఇద్దరు చనిపోతే స్థలం లేక చెరువు భూమిలో నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతుండటంతో పరిస్థితి దయనీయంగా మారింది. 'ప్రభుత్వ భూమిలో అక్రమంగా సాగుచేస్తే సహించేది లేదు. శ్మశాన స్థలాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటాము'అని జంగారెడ్డిగూడెం డీఎల్పీవో రజావుల్లా తెలిపారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై శాఖాపరమైన చర్యలు చేపడతామని చెప్పారు.


వరిసాగు


బురదమయంగా ఉపాధి హామీ పథకంలో వేసిన దారి

10 AM to 1 PM మేమున్నాం.. మీకు తోడుగా..
జంగారెడ్డిగూడెం : 80085 74478
కొయ్యలగూడెం: 80085 74947
చింతలపూడి : 76759 19086

పోలవరం, న్యూస్‌టుడే

సమస్య: పోలవరం మండలం కుంకాల గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయం పరిసరాల్లో కాలువ ధ్వంసం అవడంతో మురుగంతా ఆలయం ముందు చేరి దుర్గంధం వెదజల్లుతోంది. పంచాయతీ వారికి చెప్పినా పట్టించుకోవడం లేదు.
-కలుం ధర్మరాజు, కుంకాల

సమాధానం: పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటాం.
-సీహెచ్ శ్రీనివాస్, ఇన్‌ఛార్జి ఎంపీడీవో

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే

సమస్య: చింతలపూడి కొప్పులవారి వీధిలో నివాసాల మధ్య వ్యర్థాలు వేస్తున్నారు. వాటి నుంచి భరించలేని దుర్వాసన వస్తోంది. వర్షాకాలం కావడంతో మరింత ఇబ్బందికరంగా ఉంటోంది. వ్యర్థాలు తొలగించాలి. **-కరీముల్లా, స్థానికుడు**

సమాధానం: వ్యర్థాలు తొలగించి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం. **-పావని, కమిషనర్, చింతలపూడి**

శరన్నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబు

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాలకు అమ్మవారి ఆలయాలు ముస్తాబవుతున్నాయి. కొయ్యలగూడెంలో సుమారు రూ.45 లక్షలతో పునర్నిర్మించిన శ్రీచక్ర సహిత కనకదుర్గమ్మ ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. మండపాన్ని భక్తుల పూజలకు వీలుగా నిర్మించారు. చలువ పందిళ్ల నిర్మాణం చేపట్టారు. రహదారులకు ఇరువైపులా విద్యుద్దీప తోరణాలతో అలంకరించారు. అక్టోబరు 3 నుంచి 12వ తేదీ వరకు అమ్మవారి దసరా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ మంతెన సోమరాజు తెలిపారు. బయ్యనగూడెం శ్రీచక్ర సహిత కనకదుర్గమ్మ ఆలయం, కొయ్యలగూడెం, కన్నాపురం వాసవీ అమ్మవారి ఆలయాల్లో, కన్నాపురం విజయకనకదుర్గమ్మ ఆలయం, యర్రంపేట ఉమారామలింగేశ్వరాలయం, పులివాగు శివాలయాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు.


కొయ్యలగూడెం కనకదుర్గమ్మ ఆలయం వద్ద ఏర్పాట్లు

పవన్‌కల్యాణ్‌కు సంఘీభావంగా పాదయాత్ర

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: శ్రీవారి లడ్డూ విషయంలో అపచారం జరిగిందని ప్రాయశ్చిత్త దీక్ష చేసి, కాలినడకన తిరుమల వెళ్లి శ్రీవారిని దర్శించుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు సంఘీభావంగా బుట్టాయగూడెం నుంచి జంగారెడ్డిగూడెం గోకులపారిజాతగిరి వేంకటేశ్వరస్వామి క్షేత్రానికి ఎన్డీయే నాయకులు బుధవారం పాదయాత్రగా తరలివెళ్లారు. కరాటం సాయి, వెంకటరెడ్డినాయుడు, మెట్టా బుచ్చిరాజు, పాదం నాగకృష్ణ, తీగల గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న ఎన్డీయే నాయకులు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల మండలం బుట్టాయగూడెం సర్పంచి కేతా నాగ సుబ్రహ్మణ్యం తెదేపాలో చేరారు. ఆ పార్టీ నల్లజర్ల కార్యాలయంలో ద్వారకాతిరుమల మండల అధ్యక్షుడు లంకా సత్యనారాయణ ఆధ్వర్యంలో గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు బుధవారం ఆయనకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాగ సుబ్రహ్మణ్యంతో పాటు మరో పది మంది వైకాపా కార్యకర్తలు తెదేపాలో చేరారు.

కలప ట్రాక్టర్ బోల్తా

టి.నరసాపురం, న్యూస్‌టుడే: టి.నరసాపురం నుంచి బుట్టాయగూడేనికి కలప లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ బొర్రంపాలెంలో నీటితో నిండిన గోతిలో పడి బుధవారం సాయంత్రం బోల్తా పడింది. గత నెల 28న అదే ప్రాంతంలో ప్రమాదం జరిగింది. ఈ నేపథ్యంలో స్థానికులు, ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.

ఉచిత వైద్య పరీక్షలు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమంలో భాగంగా ద్వారకాతిరుమల దేవస్థానం ఆధ్వర్యంలో స్థానిక కల్యాణ మండపంలో ఉచిత మెగా వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. సుమారు 400 మంది దేవస్థానం ఉద్యోగులు, సిబ్బందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. వైద్యురాలు స్వరూపా రెడ్డి సేవలందించారు. ఆలయ డిప్యూటీ ఈవో బాబూరావు మాట్లాడుతూ భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన గాలి, నీరు మంచి వాతావరణం అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రెడ్డిగణపవరం శివారు ములగలగూడెం పునరావాస కాలనీకి చెందిన పోలవరం నిర్వాసితులు బుట్టాయగూడెం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న మహాత్మా గాంధీ విగ్రహం వద్ద బుధవారం వినతి పత్రం ఉంచి ధర్నా చేశారు. కాలనీకి వచ్చి మూడేళ్లయినా పూర్తిస్థాయిలో సదుపాయాలకు నోచుకోలేదని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. వివాదాల్లో లేని భూమిని కేటాయించాలని, శ్మశానవాటికకు స్థలం చూపాలని కోరారు. స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలన్నారు. నాయకులు కారం భాస్కర్, పోలోజు నాగేశ్వరరావు, నిర్వాసితులు విజయరత్నకుమారి, రామారావు, సంకురుదొర, మూలెం శారమ్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉప తహసీల్దార్ పాయం రమేశ్‌కు వినతిపత్రం అందజేశారు.


మహాత్మాగాంధీ విగ్రహం వద్ద వినతి పత్రం ఉంచుతున్న నిర్వాసితులు

ఎక్సైజ్ సీఐగా శ్రీనుబాబు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ సీఐగా కె.శ్రీనుబాబు బాధ్యతలు స్వీకరించారు. ఆయన విజయవాడ భవానీపురం స్టేషన్‌లో ఎస్సైగా పనిచేస్తూ పదోన్నతిపై సీఐగా ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన సీఐ పట్టాభి చౌదరి తునికి బదిలీ అయ్యారు. భీమడోలు నుంచి జి.వెంకటలక్ష్మి, పిఠాపురం నుంచి ఎస్ఎన్ఎస్ సుబ్రహ్మణ్యం ఎస్సైలుగా జంగారెడ్డిగూడెం వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై రాజేశ్ రాజమహేంద్రవరానికి బదిలీ అయ్యారు.

ఎండైనా.. వానైనా అక్కడే..!

పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో దాదాపు 600 మంది విద్యార్థులున్నారు. వీరిలో 200 మంది నిత్యం సైకిళ్లపై పాఠశాలకు వస్తున్నారు. షెడ్డు లేకపోవడంతో సైకిళ్లను ఆరుబయటే ఉంచాల్సి వస్తోంది. దీంతో ఎండకు ఎండి, వానకు తడుస్తున్నాయి. ఈ కారణంగా తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. దీనిపై పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీకాంతం మాట్లాడుతూ షెడ్డు ఏర్పాటు విషయమై అధికారులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడామన్నారు. **- న్యూస్‌టుడే, పోలవరం**




వరద తొలగింది.. బురద తేలింది!

పోలవరం, న్యూస్‌టుడే: గోదావరికి వరద తగ్గడంతో రేవుల్లో ఒండ్రుమట్టి పేరుకుపోవడంతో ప్రజలు స్నానాలకు ఇబ్బందులు పడుతున్నారు. బంగారమ్మపేట, పట్టిసీమ రేవుల్లో భవానీలు, స్థానికులు ఎక్కువగా స్నానాలు చేస్తుంటారు. మెట్లపై మట్టి కారణంగా జారుతోందని చెబుతున్నారు. ఈ సమస్యపై పట్టిసీమ పంచాయతీ కార్యదర్శి టి.విజయకుమారి మాట్లాడుతూ కూలీలను ఏర్పాటు చేసి మట్టి తొలగించే పనులు చేపడతామని చెప్పారు.



పచ్చదనం.. పరవశం..!

బుట్టాయగూడెం మండలం కోట రామచంద్రపురం నుంచి పోలవరం మండలం లక్ష్మీనారాయణదేవిపేటకు వెళ్లే మార్గంలో రహదారికి ఇరువైపులా దట్టమైన వృక్షాలున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు చెట్లకొమ్మలు విస్తరించడంతో రహదారిని కమ్మేస్తున్నాయి. పచ్చదనాన్ని ఆస్వాదిస్తూ వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. **- ఈనాడు, బుట్టాయగూడెం**




ధర్మాజీగూడెంలో మాట్లాడుతున్న రోషన్ కుమార్


జంగారెడ్డిగూడెం తెదేపా కార్యాలయంలో..


చక్రదేవరపల్లిలో స్వచ్ఛ ప్రతిజ్ఞ

బాపూజీ ఆశయం.. సమాజానికి మార్గదర్శకం!

లింగపాలెం, న్యూస్‌టుడే: స్వచ్ఛత కార్యక్రమాల్లో యువత చురుగ్గా పాల్గొని, ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమంలో భాగంగా లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పంచాయతీ అధికారులకు ప్రజలు సహకరించి గ్రామాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ముందుగా మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: పురపాలక కార్యాలయం వద్ద మహాత్మా గాంధీ విగ్రహానికి ఛైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహాత్ముని అడుగుజాడల్లో ప్రతిఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు.✦ తెదేపా కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి పార్టీ పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ నివాళులర్పించారు.✦ అప్‌ల్యాండ్ క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో మహాత్మునికి నివాళులర్పించారు.✦ చక్రదేవరపల్లిలో తెదేపా మండల అధ్యక్షుడు, సర్పంచి సాయిల సత్యనారాయణ ఆధ్వర్యంలో 'స్వచ్ఛ తాహీ సేవా' ప్రతిజ్ఞ నిర్వహించారు. శ్రీనివాసపురంలో గాంధీ చిత్రపటానికి తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్‌చంద్ర శేషు పూలమాలలు వేశారు.

కామవరపుకోట (జంగారెడ్డిగూడెం), న్యూస్‌టుడే: స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ప్రసాదించిన మహనీయుడు గాంధీజీ అని మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ అన్నారు. కామవరపుకోటలో నిర్వహించిన కార్యక్రమంలో మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ✦ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో, జనసేన మండల అధ్యక్షుడు షేక్ వలీ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద గాంధీజీ జయంతి నిర్వహించారు.

చింతలపూడి, పట్టణం, న్యూస్‌టుడే: మహాత్ముడి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని జడ్జి మధుబాబు అన్నారు. చింతలపూడి ఉపకారాగారాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షణికావేశంలో తప్పులు చేసి జీవితాలను పాడుచేసుకోవద్దని సూచించారు. సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. అనంతరం మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.✦ చింతలపూడి మెరకవీధిలో మహాత్ముని విగ్రహానికి నగర పంచాయతీ కమిషనర్ డి.పావని పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు ధర్మరాజు, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల మండలంలోని అన్ని గ్రామాల్లో గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.✦ పంగిడిగూడెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. మహాత్మా గాంధీ చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు.

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: గాంధీజీ జయంతిని పురస్కరించుకుని మండలంలోని పంచాయతీ కార్యాలయాల వద్ద గ్రామసభలు నిర్వహించి అభివృద్ధి ప్రణాళికలపై చర్చించారు.


పోలవరంలో బొరగం శ్రీనివాసులు ఆధ్వర్యంలో..


కామవరపుకోట డిగ్రీ కళాశాలలో..

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం పంచాయతీ కార్యాలయంలో రాష్ట్ర ట్రైకార్ సంస్థ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ఎస్.వెంకటరెడ్డి, పోలీస్ సబ్‌డివిజన్ కార్యాలయంలో డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావులు గాంధీజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు.✦ గాంధీజీ జయంతి సందర్భంగా దిల్లీలోని విజ్ఞాన భవన్‌లో ప్రధాని మంత్రి మోదీ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పోలవరం మండలం కొత్తపట్టిసీమ సర్పంచి మైగాపుల విజయదుర్గ పాల్గొన్నారు.

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద డీఎస్పీ వెంకటేశ్వరరావు, ఏపీవో పీవీఎస్ నాయుడు తదితరులు మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పరిసరాల్లో పెరిగిన పిచ్చి మొక్కలను శ్రమదానంతో తొలగించి శుభ్రం చేశారు. ✦ బుట్టాయగూడెంలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో అరుంధతీ నగర్ మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రాతపుస్తకాలు, పెన్నులు అందజేశారు.

జీలుగుమిల్లి, న్యూస్‌టుడే: జాతిపిత మహాత్మాగాంధీ సేవలు మరువలేనివని ఎస్సై నవీన్‌కుమార్ అన్నారు. జీలుగుమిల్లి పోలీస్ స్టేషన్‌లో గాంధీజీ చిత్ర పటానికి నివాళులర్పించారు.

టి.నరసాపురం, న్యూస్‌టుడే: మహాత్మా గాంధీ ఆశయాలు సమాజానికి మార్గదర్శకమని తెదేపా రాష్ట్ర కార్యదర్శులు జయవరపు శ్రీరామమూర్తి, శీలం వెంకటేశ్వరరావు అన్నారు. గాంధీజీ జయంతిని మండలంలోని టి.నరసాపురం, కేతవరం, బొర్రంపాలెం, మక్కినవారిగూడెం, వెలగపాడు తదితర గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు.

ఇసుక నాణ్యత పరిశీలన

చింతలపూడి, న్యూస్‌టుడే: చింతలపూడిలో నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రి ప్రహరీ నిర్మాణంతో పాటు ఇతర అవసరాలకు నాసిరకం ఇసుక వినియోగిస్తున్నారనే సమాచారంతో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ నారాయణరావు బుధవారం పరిశీలించారు. పొలాలు, వాగుల ఇసుక వినియోగించొద్దని గుత్తేదారును హెచ్చరించారు. నాణ్యత కలిగిన ఇసుక మాత్రమే వినియోగించాలన్నారు. ప్రహరీ నునుపు పనులను ఆపేయాలని సూచించారు.

కులదూషణ కేసుపై విచారణ

టి.నరసాపురం, న్యూస్‌టుడే: బొర్రంపాలెంలో గత నెల 22న నమోదైన కులదూషణ కేసుకు సంబంధించి పోలవరం డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు బుధవారం విచారణ నిర్వహించారు. ఆయనతో పాటు ఎస్సై జయబాబు ఉన్నారు.

10 అడుగుల నల్లతాచు హతం

జీలుగుమిల్లి, న్యూస్‌టుడే: గాంధీ జయంతి సందర్భంగా బుధవారం ఉదయం జీలుగుమిల్లి పంచాయతీ కార్యాలయంలో సిబ్బంది పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తుండగా సుమారు 10 అడుగుల నల్లతాచు సిబ్బంది కంటపడింది. భయభ్రాంతులైన వారంతా బయటకు పరుగులు తీశారు. స్థానికుల సహాయంతో పామును చంపారు. ఈ రకం అరుదుగా కనిపిస్తుందని, చూడటం ఇదే తొలిసారని సిబ్బంది తెలిపారు.

రెండు ఇసుక లారీల పట్టివేత

అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: అశ్వారావుపేట పోలీసులు బుధవారం రెండు ఇసుక లారీలను పట్టుకున్నారు. ఎస్సై యయాతిరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం వింజరం నుంచి ఏపీలోని జంగారెడ్డిగూడేనికి రెండు లారీల్లో ఇసుకను తరలిస్తున్నారు. వాటిని ఆపి తనిఖీ చేయగా అధిక లోడుతోపాటు తెలంగాణ రహదారులపై రావాణా అనుమతులు లేనట్లు గుర్తించి వాటిని పట్టుకుని పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. పట్టుబడిన లారీలను జిల్లా మైనింగ్ అధికారులకు అప్పగిస్తున్నట్లు పేర్కొన్నారు.

నూజివీడు

•నూజివీడు •కైకలూరు

ధ్యానంతో ఒత్తిడి దూరం



ప్రదర్శన నిర్వహిస్తున్న ధ్యానులు

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరు దైనందిన జీవితంలో ధ్యానాన్ని భాగం చేసుకోవడం ద్వారా ఒత్తిడిని జయించవచ్చని పిరమిడ్ మాస్టర్లు తెలిపారు. ఆగిరిపల్లి బ్రాహ్మణ వీధిలోని గిరి కపాటి పిరమిడ్ ధ్యాన మందిరం ఆధ్వర్యంలో బుధవారం ధ్యాన శిబిరం నిర్వహించారు. దీర్ఘకాలిక రుగ్మతలకు ధ్యానంతో చక్కటి పరిష్కారం లభిస్తుందని చెప్పారు. శాకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని తెలిపారు. అనంతరం ధ్యానులు శాకాహార ప్రదర్శన నిర్వహించారు.

వ్యర్థ రహిత గ్రామాలే లక్ష్యం

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: వ్యర్థ రహిత ఆదర్శ గ్రామాలే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీవో అబ్దుల్ సలామ్ తెలిపారు. ఆగిరిపల్లి సచివాలయంలో, యూనియన్ బ్యాంక్ దగ్గర బుధవారం 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమంపై కళాజాతా, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ సర్పంచి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కళాజాతాలో పాల్గొన్న ఇన్‌ఛార్జి ఎంపీడీవో అబ్దుల్ సలాం, అధికారులు



చనుబండలో ఉత్సవాలకు శ్రీకారం

బతుకమ్మ... బతుకమ్మ.. ఉయ్యాలో

చాట్రాయి, న్యూస్‌టుడే: చనుబండ గ్రామంలోని బీసీ ప్రాంతంలో మహిళలు బుధవారం బతుకమ్మను అలంకరించి ఉత్సవాలను ప్రారంభించారు. ఇలా తొమ్మిది రోజులు పూజలు చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

ఘాట్‌రోడ్డు నిర్మాణానికి నేడు శంకుస్థాపన

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లిలోని శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ఘాట్ రోడ్డు నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేయనున్నట్లు ఆలయ ఈవో డి.సురేశ్ బాబు తెలిపారు. దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి కొలుసు పార్థసారథి, దేవాదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ, ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారన్నారు. రూ.2 కోట్లతో రెండున్నర కిలోమీటర్ల పొడవు, 7.5 మీటర్ల వెడల్పుతో శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి ఆలయం నుంచి దుర్గా పార్వతీ సమేత మల్లికార్జున స్వామి ఆలయం వరకు ఘాట్ రోడ్డును నిర్మించనున్నట్లు తెలిపారు.

స్వచ్ఛ భారత్ లక్ష్యంగా పని చేయాలి

చాట్రాయి, న్యూస్‌టుడే: స్వచ్ఛ భారత్ లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని తెలుగు రైతు జిల్లా అధికార ప్రతినిధి మోరంపూడి శ్రీనివాస రావు కోరారు. చనుబండలో బుధవారం గాంధీ జయంతిని పురస్కరించుకుని రహదారుల పరిశుభ్ర పరిచారు. కాలువలను శుభ్రం చేయించారు. ఉప సర్పంచి దిరిశాల చినబాబు, నాయకులు విస్సంపల్లిరామకృష్ణ, పరసా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సినిమాలు

నూజివీడు పట్టణం

సత్యనారాయణ	దేవర
సత్యనారాయణ మినీ	సత్యం సుందరం
ద్వారక సినిమాస్ స్క్రీన్ 1	దేవర
ద్వారక సినిమాస్ స్క్రీన్ 2	మత్తు వదలరా 2
ద్వారక సినిమాస్ స్క్రీన్3	దేవర
ఆగిరిపల్లి: శ్రీఅను డీలక్స్	కళింగ
కైకలూరు	
విజయలక్ష్మి జీ3 సినిమాస్	దేవర
మాగంటి సినిమాస్	సత్యం సుందరం
శ్రీవెంకటరమణ సినిమాస్	దేవర
ముదినేపల్లి: పూర్ణిమ	దేవర


కళల్లో మేటి.. వారికి వారే సాటి

ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ పోటీల్లో చిన్నారుల ప్రతిభ ✧ రాష్ట్ర స్థాయిలో బహుమతులు

కలిదిండి, న్యూస్‌టుడే: బాల్యం ప్రతి ఒక్కరికి ఏదో ఒక ప్రతిభను వరంగా ఇస్తుంది. దానిని గుర్తించి వెలికి తీయగలిగితే అద్భుతాలను ఆవిష్కృతమవుతాయి. కలిదిండి మండలం తాడినాడ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆ దిశగా తమలోని ప్రతిభకు సానబెడుతున్నారు. అందమైన.. అర్థవంతమైన బొమ్మలు గీయడం.. కొబ్బరి చిప్పలు.. పీచుతో ఆకట్టుకునే ఆకృతులను తయారు చేయడంలో మేటిగా నిలుస్తున్నారు. క్రియేటివ్ ఆర్ట్స్ అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో జిల్లాల కౌన్సిల్లో నిర్వహించిన ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ పోటీల్లో ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి బహుమతులు సాధించారు. 400 మంది పాల్గొన్న ఈ పోటీల్లో ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి బహుమతులు సాధించి స్ఫూర్తిగా నిలిచారు. నలుగురు ప్రత్యేక బహుమతులు అందుకున్నారు.

భారతీయం బహుముఖం..





భారతదేశం చిత్రపటం వేసి.. దానిలో సమానత్వం, స్వేచ్ఛా స్వతంత్రం, శాంతి - సామరస్యం, ఆర్థిక పురోగతి, భావ ప్రకటనా స్వేచ్ఛ, ఉచిత విద్య తదితర అంశాలను పొందుపర్చాను. వీటితో పాటు భారతదేశంలో ప్రాధాన్యం కలిగిన అంశాలను పెయింటింగ్ రూపంలో వేశా. ఇవి న్యాయ నిర్ణేతలను ఆకట్టుకున్నాయి. ప్రాధాన్యతాంశాలను ఎంపిక చేసుకోవడంలో చిత్ర లేఖనం మాస్టారు నాగరాజు సూచనలు చాలా ఉపయోగ పడ్డాయి. రాష్ట్ర స్థాయిలో బహుమతి సాధించడం సంతోషంగా ఉంది. **- ముగిది అన్విత, 9వ తరగతి**

కొబ్బరి చిప్పలతో ఏనుగు..





నిరుపయోగంగా ఉన్న వస్తువులతో వివిధ రకాల ఆకృతులను తయారు చేయడం పట్ల నాకు ఆసక్తి ఉంది. ఈ విషయాన్ని మా వృత్తి విద్య(క్రాఫ్ట్) ఉపాధ్యాయుడు వెంకట రెడ్డి గుర్తించి నన్ను ప్రోత్సహించారు. కొబ్బరి ఆధారిత వస్తువులైన పీచు, కొబ్బరి చిప్పలను ఉపయోగించి ఏనుగు నమూనాను తయారు చేశాను. మధ్య భాగాన్ని కొబ్బరి చిప్పలు, తొండం, కాళ్లు, తోక భాగాల తయారీకి పీచును వాడాను. ఈ నమూనాలో జీవం ఉట్టి పడినట్లు ఉండటంతో దీనిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసి బహుమతిని అందించారు. ఇది నాకెంతో ప్రోత్సాహకంగా ఉంది. **- గొరిపర్తి హరిశ్చంద్రప్రసాద్, 10వ తరగతి**

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నూజివీడు : 99486 40551 | కైకలూరు: 73060 88555
ముసునూరు : 93983 81268 | కలిదిండి: 90594 84862

కైకలూరు, న్యూస్‌టుడే

సమస్య: మండలంలోని రామవరం ఎస్సీ వాడలో సిమెంటు రహదారులపై మురుగు నీరు ప్రవహిస్తోంది. రాకపోకలు సాగించేందుకు స్థానికులు అవస్థలు పడుతున్నారు. దోమలు వృద్ధి చెందడంతో అవస్థలు తప్పడం లేదు. **- వరలక్ష్మి, రామవరం**

సమాధానం: వెంటనే మురుగు తొలగించేలా చర్యలు చేపట్టి దోమల నివారణకు ఎబేట్ ద్రావణం పిచికారీ చేయిస్తాం. **- వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి**

ముసునూరు, న్యూస్‌టుడే

సమస్య: చింతలవల్లిలో పలు వీధుల్లోని మురుగు కాలువల్లో పూడిక తీయకపోవడంతో నీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు బెడద అధికమై ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. **- స్థానికులు**

సమాధానం: వెంటనే పూడిక తీయిస్తాం. **- నీరజ, పంచాయతీ కార్యదర్శి**

వీధి దీపాలు వెలిగాయి

స్పందనకు వందనం

ముసునూరు, న్యూస్‌టుడే: గోపవరం బీసీ కాలనీలో అక్కడక్కడ వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు. దీనిపై బుధవారం 'ఈనాడు'లో 'మేమున్నాం.. మీకు తోడు'గా శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరావు స్పందించి వీధి దీపాలకు మరమ్మతులు చేయించి వెలిగేలా చేశారు. స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఆక్వా కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న రవి

కలిదిండి, న్యూస్‌టుడే: ఆక్వా రొయ్యలు, చేపల చెరువులపై పని చేసే కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి అన్నారు. ఈ మేరకు స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో బుధవారం వ్యవసాయ, కార్మిక సంఘాల నాయకులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్వా చెరువులపై కాపలాదారులుగా పని చేస్తున్న వారితో పాటు ఇతర ప్రాంతాలకు వల పట్టుబడులకు వెళ్తూ అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని కార్మికశాఖ ఆధ్వర్యంలో వారి సంక్షేమానికి ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో పి.రామకృష్ణ, శేషపు మహంకాళిరావు, సోమయ్య, భాస్కరరావు, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

4న అత్యవసర సర్వసభ్య సమావేశం

నూజివీడు, న్యూస్‌టుడే: నూజివీడు మండల ప్రజా పరిషత్ అత్యవసర సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 4న మధ్యాహ్నం 2 గంటలకు నూజివీడు ఎంపీడీవో కార్యాలయంలో మంత్రి కొలుసు పార్థసారథి, ఎంపీపీ ఆరేపల్లి శిరీష అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో సి.రాఘవేంద్రనాథ్ తెలిపారు. అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

వైకాపా నిర్లక్ష్యంతోనే కాలువలకు దుర్భర స్థితి: కామినేని

కైకలూరు, న్యూస్‌టుడే: అయిదేళ్ల వైకాపా నిర్లక్ష్య పాలనతో పంట, మురుగు కాలువలు దుర్భర దుస్థితికి చేరుకున్నాయని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ఆటపాకలో పుల్లవా మురుగు కాలువ పూడికతీత పనులను కూటమి శ్రేణులతో కలిసి బుధవారం ప్రారంభించి 2 కిలోమీటర్ల మేర ద్విచక్ర వాహనంపై వెళ్లి కాలువ దుస్థితిని పరిశీలించారు. కామినేని మాట్లాడుతూ శాఖల మధ్య సమన్వయ లోపంతోనే కైకలూరు ముంపుబారిన పడిందని దీని ప్రభావంతో 15 రోజులైనా కొన్నిచోట్ల ఇంకా ముంపు కొనసాగుతోందన్నారు. 165వ నెంబరు జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ఆటపాక పుల్లవా కాలువపై బ్రిడ్జి ఏర్పాటు చేసేందుకు మట్టి గుట్టలు తవ్వి వదిలేసినా జలవనరులు, ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోలేదని మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో అనుసరించిన నిర్లక్ష్యపు పోకడలను అధికారులు వీడనాడాలని సూచించారు.

రైతుల సహకారంతో.. పుల్లవా మురుగు కాలువ పూడికతీత పనులు రైతుల సహకారంతో జరుగుతున్నట్లు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వంపై భారం పడకుండా రైతులు సొంత నిధులు సమకూర్చి సమన్వయంతో ముందుకు రావడం అభినందనీయమన్నారు. కాలువల ఆధునికీకరణకు భవిష్యత్తులో ఉపయోగ పడేలా పంటులను కొనుగోలు చేసి కాలువల్లో నిరంతరం పూడికతీత పనులు నిర్వహించేలా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. దీంతో కైకలూరు ఇంకెప్పుడు ముంపు బారిన పడకుండా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్ రావు, రాష్ట్ర చేపల రైతు సంఘం అధ్యక్షుడు నంబూరి వెంకటరామరాజు, నాయకులు త్రినాథ రాజు, పూల రామచంద్రరావు, ఎండీ జానీ, బి.విజయలక్ష్మి, కొల్లి వరప్రసాద్, బి.శ్రీనివాస్, ప్రసాదరాజు, వాసురాజు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుపరచకుంటే చర్యలు: కలెక్టర్

దెందులూరు, న్యూస్‌టుడే: కొవ్వలి సాంఘిక సంక్షేమశాఖ బాలుర వసతి గృహాన్ని కలెక్టర్ కె.వెట్రి సెల్వి బుధవారం తనిఖీ చేశారు. వసతి గృహంలో మురుగునీటి పారుదల సమస్యను పరిష్కరించాలని గత నెల 26న ఆమె సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో పనుల తీరుతెన్నులు పరిశీలించేందుకు వసతి గృహాన్ని సందర్శించారు. వసతి గృహం ఆవరణలో మురుగు పేరుకుపోవడంపై సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మురుగు పారుదల సమస్య తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మరోమారు స్పష్టం చేశారు. దెబ్బతిన్న పైపులైన్లు, తలుపులు, కిటికీలు మార్చాలని దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు ప్రతిపాదనలు పంపాలని, వెంటనే నిధులు కేటాయిస్తామని ఆమె పేర్కొన్నారు. కలెక్టర్ వెంట సాంఘిక సంక్షేమ శాఖ జేడీ జయప్రకాశ్ తదితరులున్నారు.

విస్తృతంగా తెదేపా సభ్యత్వాలు: మంత్రి



మాట్లాడుతున్న పార్థసారథి

నూజివీడు, న్యూస్‌టుడే: తెదేపా సభ్యత్వం కలిగి ఉండటం వల్ల ప్రతి ఒక్కరికి గౌరవం, గుర్తింపు, ఆత్మ స్థైర్యం, నాయకుడిగా ఎదిగే అవకాశం ఉంటుందని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు పట్టణంలోని రోటరీ కల్యాణ మండపంలో బుధవారం రాత్రి తెదేపా సభ్యత్వాల నమోదు, కృష్ణా-గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎన్నికల ఓటు నమోదుపై అవగాహన కార్యక్రమంలో మంత్రి పాల్గొని ఎన్టీఆర్ చిత్ర పటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి ఎన్టీఆర్ అన్నారు. ఎన్టీఆర్ ఎన్నో సిద్ధాంతాలు, గొప్ప లక్ష్యం కోసం పార్టీని స్థాపించారని, తెలుగు ప్రజల గౌరవం దేశం నలుమూలల చాటిన వ్యక్తి ఎన్టీఆర్ అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి డిగ్రీ పట్టా పొందిన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకుని ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు ఓటు వేసి ఆయనను మండలికి పంపి రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి దసరా ఉత్సవాలు

ముస్తాబైన శ్యామలాంబ దేవస్థానం



కైకలూరు, న్యూస్‌టుడే: గురువారం నుంచి దసరా శరన్నవ రాత్రి మహోత్సవాలు ప్రారంభమవుతున్న తరుణంలో మండలంలోని పలు దేవాలయాలు ముస్తాబయ్యాయి. ఈ క్రమంలో కైకలూరు ప్రాంత ప్రజల ఇలవేల్పయిన శ్యామలాంబ అమ్మవారి దేవస్థానం విజయదశమి వేడుకలకు సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. దేవస్థానానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా క్యూ లైన్లు ఏర్పాటుతో పాటు అన్ని వసతులు కల్పించారు. విద్యుద్దీపాలంకరణలో దేవస్థానం ప్రాంగణం చూపరులను విశేషంగా ఆకట్టుకుంటుంది.



కైకలూరులో గాంధీజీకి అంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్, కూటమి శ్రేణులు



నూజివీడు ఉపకారాగారంలో మాట్లాడుతున్న జడ్జి శివ పార్వతి



నివాళి అర్పిస్తున్న భాజపా నాయకులు



నూజివీడు ట్రిపుల్ ఐటీ కళాశాలలో శుభ్రం చేస్తున్న విద్యార్థులు



మండవల్లి గాంధీ ఆశ్రమంలో..



నూజివీడు పురపాలక కార్యాలయంలో అధ్యక్షురాలు త్రివేణి దుర్గ తదితరులు

మహాత్ముడి మార్గం అనుసరణీయం



ఆర్డీవో కార్యాలయం ఆవరణలో ఆర్డీవో భవానీ శంకరి..

జాతిపిత మహాత్మా గాంధీజీ, భారత మాజీ ప్రధానమంత్రి లాల్‌బహదూర్ శాస్త్రిల మార్గం అనుసరణీయమని, వారి ఆశయాలు స్ఫూర్తిదాయకమని నూజివీడు, కైకలూరు నియోజకవర్గం నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు కొనియాడారు. నేతల జయంతి సందర్భంగా వారి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మంత్రి పార్థసారథి క్యాంపు కార్యాలయంలో గాంధీజీ జయంతి నిర్వహించారు. కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ గాంధీ బొమ్మ కూడలిలోని మహాత్ముడి విగ్రహానికి పూల మాలలు వేసి అంజలి ఘటించారు. గ్రామాల్లో తెలుగుదేశం, భాజపా, జనసేన, వైకాపా తదితర పార్టీల నాయకులు ఘనంగా జయంతిని నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు గాంధీ, శాస్త్రిల చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. **- న్యూస్‌టుడే బృందం**

రహదారిపై కంచె వేశారని ధర్నా

చాట్రాయి, న్యూస్‌టుడే: రహదారిపై కంచె వేసి తమను గృహాల నుంచి బయటకు రాకుండా చేశారని ఫిర్యాదు చేసి తొమ్మిది రోజులు గడుస్తున్నా పోలీసులు, రెవెన్యూ యంత్రాగం పట్టించుకోవడం లేదనే మూడు కుటుంబాలు తమ పిల్లలతో కలిసి బుధవారం చాట్రాయి రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. కోటపాడు గ్రామానికి చెందిన చీపు దుర్గారావు, నాగరాజు, వెంకటేశ్వరరావు కుటుంబాలకు వేముల నాగేశ్వరరావు, శివకృష్ణ, దుర్గారావులతో స్థల వివాదాలున్నాయి. కంచె బాధిత కుటుంబాల ధర్నాకు సీపీఐఎంఎల్ జిల్లా కమిటీ సభ్యులు దుర్గం పుల్లారావు మద్దతు తెలిపారు.

గండి తూము ఏర్పాటు చేయాలని ఆందోళన

ముదినేపల్లి, న్యూస్‌టుడే: జాతీయ రహదారి విస్తరణ పనులు ఇష్టానుసారం చేసి తామరాల కాలువలోకి వెళ్లే గండి తూము తొలగించారని, దాన్ని తిరిగి ఏర్పాటు చేయాలని చినపాలపర్రు, ముదినేపల్లికి చెందిన రైతులు బుధవారం ఆందోళన నిర్వహించారు. విస్తరణ పనుల్లో భాగంగా గండి తూమును తొలగించిన ఎన్‌హెచ్ అధికారులు తిరిగి ఏర్పాటు చేయకపోవడంతో పంట పొలాల్లోని మురుగు బయటకు వెళ్లడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు వంద ఎకరాల్లోని మురుగు నీరు నెలరోజులుగా పొలాల్లోనే ఉండటంతో పంట పూర్తిగా కుళ్లి పోయిందన్నారు. తూము ఏర్పాటు చేయాలని జాతీయ రహదారి అధికారులను అడిగితే డిజైన్‌లో లేదని, రైతులే స్వచ్ఛందంగా ఏర్పాటు చేసుకోవాలంటున్నారని వాపోయారు. ఇప్పటికయినా ఉన్నతాధికారులు స్పందించి గండి తూము ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. రైతులు దాయినేని కృష్ణాజీరావు, చింతపల్లి రాజారావు, చింతపల్లి కిశోర్, దుక్కిపాటి చక్రధర్, గాంధీ, తిలక్ తదితరులు పాల్గొన్నారు.

'దోమల మందు ఎందుకు చల్లడం లేదు'

మండవల్లి, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా మండవల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామ సభలను నిర్వహించారు. మండవల్లిలో నిర్వహించిన సభలో దోమల మందును ఎందుకు చల్లించలేదని ప్రజలు అధికారులను ప్రశ్నించారు. దోమల ఉద్ధృతి ఎక్కువగా ఉండటంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని వాపోయారు. దీనిపై ఔషధ పర్యవేక్షకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ రెండేళ్లుగా దోమల మందు సరఫరా లేదని వివరణ ఇచ్చారు. అనంతరం గ్రామసభ ఎజెండాలో భాగంగా స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా స్వర్ణాంధ్ర-2047, ఇది మంచి ప్రభుత్వం, మన ఇల్లు, మన గౌరవం కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఇందులో సర్పంచి మెండా ఝాన్సీ, ఉప సర్పంచి నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సమస్యలపై నిలదీస్తున్న ఐక్యవేదిక సభ్యులు..

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



ఘటనా స్థలిని పరిశీలిస్తున్న ఎస్సై లక్ష్మణబాబు

నూజివీడు, న్యూస్‌టుడే: రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయాలైన ఘటన నూజివీడు మండలం దేవరగుంటలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... దేవరగుంట అడ్డరోడ్డు సమీపంలో రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఆ ప్రమాదంలో ఒక లారీ డ్రైవర్‌కు, వెనుక నుంచి వస్తున్న ద్విచక్ర వాహన చోదకుడికి తీవ్ర గాయాలు కావడంతో తొలుత నూజివీడు ఏరియా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించారు. నూజివీడు రూరల్ ఎస్సై ఎన్.లక్ష్మణ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలోకి దూసుకెళ్లిన వ్యాన్.. మండవల్లి, న్యూస్‌టుడే: మండవల్లి మండలం పెరికెగూడెం శివారు బ్రాంచ్ కాలువలోకి వ్యాను దూసుకెళ్లడంతో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం రామవరప్పాడు బల్లివారి వీధికి చెందిన విన్నకోట రవి వ్యాను నడుపుకుంటూ మంగళవారం రాత్రి భీమవరం నుంచి విజయవాడ వైపునకు వెళ్తున్నాడు. అర్ధ రాత్రి పెరికెగూడెం వద్దకు వచ్చేసరికి నిద్రమత్తు కారణంగా ఒక్కసారి కాలువలోని వ్యాను దూసుకుపోయింది. దీంతో డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయి హాహాకారాలు చేయడంతో స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్.ఐ. రామచంద్రరావుతో పాటు సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని 2 గంటల పాటు జేసీబీ సాయంతో ప్రయత్నించడంతో ఎట్టకేలకు బాధితుడు ప్రాణాలతో బయటకు వచ్చాడు. క్షతగాత్రుడిని 108లో గుడివాడ ఆసుపత్రికి తరలించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరు మండలం రమణక్కపేట జడ్పీ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు హ్యాండ్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు పసుమర్తి రామకృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయుడు వాకా నాగరాజు బుధవారం తెలిపారు. ఈ నెల 1న విజయవాడలో పాఠశాల క్రీడల సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన అండర్-14 విభాగంలో హ్యాండ్‌బాల్ పోటీల ఎంపికల్లో ప్రతిభ కనబరచి జె.పవన్‌కుమార్, టి.నాగ సుధ ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. వీరు త్వరలో జరిగే ఉమ్మడి కృష్ణజిల్లా తరపున రాష్ట్రస్థాయిలో పాల్గొంటారని చెప్పారు.

మద్యం దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం



మాట్లాడుతున్న మస్తానయ్య

నూజివీడు, న్యూస్‌టుడే: నూజివీడు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ స్టేషన్ పరిధిలో 16 మద్యం దుకాణాలు ఉన్నట్లు ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య తెలిపారు. నూజివీడులో ఆయన బుధవారం మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎక్సైజ్ నూతన పాలసీని తీసుకు వచ్చిందని, ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా కొత్తగా మద్యం దుకాణాలు ఏర్పాటు చేసేందుకు టెండర్ ద్వారా దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. ఈ నెల 1 నుంచి 9 వరకు మద్యం దుకాణాల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దీనికోసం తమ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామని, పూర్తి వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని సీఐ కోరారు.

మురుగు కాలువలో పడి వృద్ధుడి మృతి

కైకలూరు, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు మురుగు కాలువలో పడి వృద్ధుడు మృతి చెందిన సంఘటన కైకలూరులో చోటు చేసుకుంది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వింజరం గ్రామానికి చెందిన బొడ్డు ప్రసాద్‌కు(70) కంటి చూపు సరిగా కనిపించదు. ఈ క్రమంలో కంటి శస్త్ర చికిత్స చేయించుకునేందుకు కావాల్సిన పత్రాల కోసం మంగళవారం కైకలూరు వెళ్లారు. పని ముగించుకుని ఇంటికి వెళ్తున్న క్రమంలో అలసట తీర్చుకునేందుకు కైకలూరు అగ్నిమాపక కేంద్రం సమీపంలోని మురుగు కాలువ సిమెంటు దిమ్మపై కూర్చుని ప్రమాదవశాత్తు కాలువలో పడిపోయారు. బుధవారం ఉదయం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించగా పట్టణ సీఐ పి.కృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సాయంతో వృద్ధుడిని బయటకు తీయగా అప్పటికే మృతి చెందాడు. మృతుడి వద్ద ఉన్న ధ్రువపత్రాల ఆధారంగా వింజరం వాసిగా గుర్తించి గ్రామస్థుల సహకారంతో ఏలూరులో ఉంటున్న కుమారుడు సుధాకర్‌కు సమాచారం అందించారు. ఆయన గుర్తించడంతో కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కైకలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సీఐ తెలిపారు.

కడుపునొప్పి తాళలేక కూలీ ఆత్మహత్య.. ముసునూరు, న్యూస్‌టుడే: కడుపునొప్పి తాళలేక ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన ముసునూరు మండలం లోపూడి పంచాయతీ బాసవరప్పాడులో జరిగింది. ఇన్‌ఛార్జి ఎస్సై కె.రాజారెడ్డి కథనం మేరకు.. గ్రామానికి చెందిన కోసూరి శివకృష్ణ (39) కూలి పనుల చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గత కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఈ నెల 1న అధికంగా కడుపు నొప్పి రావడంతో తట్టుకోలేక ఇంటి నుంచి బయటకు వెళ్లి వ్యవసాయ పనులకు ఉపయోగించే పురుగుల మందు డబ్బాను కొనుక్కొని ఆ గ్రామంలో అటవీ ప్రాంతానికి వెళ్లి ఆత్మహత్యకు యత్నించాడు. అనంతరం పురుగుల మందు తాగినట్లు కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యులు అతడిని వైద్యం నిమిత్తం నూజివీడు ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లగా మార్గం మధ్యలోనే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. బుధవారం ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.